ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 295 | ఎడిటర్ : మేదే శాంతికుమార్ | బుధవారం 21 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది.

## భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు.

# బీజేపీ చేతిలోనే దేశం సురక్షితం



- తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం
- దేశ సేవ, ప్రజాసేవ లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేస్తున్నాయన్న మోదీ
- జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పలు వ్యాఖ్యలు
- బీజేపీ కార్యకర్త అనిపించుకోవడమే నాకు గర్వకారణం: మోదీ
- నాయకత్వం మారినా, గమ్యం మారొద్దు!

# ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం


మంత్రుల వ్యవహారం నుంచి దృష్టి మళ్లించేందుకే నాపై విచారణ

సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కుంభకోణం బయటపెట్టినందుకే తనపై కక్ష సాధింపు చర్యలు

రేవంత్‌రెడ్డి బావమరిదే రూ.వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు


బొగ్గుస్కామ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

రేవంత్‌రెడ్డి నిజాయతీపరుడైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.




**హైదరాబాద్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సిట్ విచారణ ముగిసింది. అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కుంభకోణం బయటపెట్టినందుకే తనపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారని ఆరోపించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసులో నిరాధార ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి బావమరిదే రూ.వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. బొగ్గుస్కామ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. రేవంత్‌రెడ్డి నిజాయతీపరుడైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. సిట్టింగ్ జడ్జికి అన్ని ఆధారాలు అందిస్తాం. మంత్రుల మధ్య వాటాల పంపకం రోడ్డు మీదకు వచ్చింది. మంత్రుల వ్యవహారం నుంచి దృష్టి మళ్లించేందుకు నాపై విచారణ చేపట్టారు. - మిగతా3లో




## తమిళనాడులో మళ్లీ గవర్నర్ Vs సర్కార్

- అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్
- జాతీయ గీతాలాపనకు నో చెప్పిన స్పీకర్
- మంగళవారం నుంచి ప్రారంభమైన తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు
- వాకౌట్ చేసిన గవర్నర్- గతంలోనూ ఇలా సభ నుంచి వెళ్లిపోయిన ఆర్ఎన్ రవి
- మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు, మాట్లాడనివ్వలేదు : గవర్నర్ కార్యాలయం
- మేం ఇచ్చిన ప్రసంగాన్నే చదవాలి : సీఎం స్టాలిన్
- గవర్నర్ ప్రసంగించినట్టుగానే నమోదు చేయిస్తాం : సీఎం
- రెండేళ్లలో మూడుసార్లు వాకౌట్

# నియోజకవర్గానికో స్క్రీనింగ్ కమిటీ

- మున్సిపాలిటీల్లోనూ 'సర్పంచ్' రిజల్ట్ రిపీటవ్వాల్సిందే!
- మున్సిపాలిటీల్లో అత్యధిక సీట్లు సాధించేలా కాంగ్రెస్ ప్రణాళిక
- లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటు
- పార్టీ తరఫున పోటీ చేయాల్సిన అభ్యర్థిని ఎంపిక చేయనున్న కమిటీలు



**హైదరాబాద్**

త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలిచేలా అధికార కాంగ్రెస్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇంఛార్జ్‌లను నియమించగా, స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించింది. అభ్యర్థుల ఎంపికతో పాటు ఎన్నికల్లో విజయానికి తగిన వ్యూహరచనలు సైతం కమిటీ చేయనుంది. నియోజకవర్గాల్లో నాయకుల మధ్య విభేదాల పరిష్కారంపైనా హస్తం పార్టీ దృష్టి సారించింది. నిర్లక్ష్యంగా వదిలేస్తే పురపాలక ఎన్నికల్లో నష్టం జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. సర్పంచ్‌ల ఎన్నికల్లో దాదాపు 60 శాతానికి పైగా ఫలితాలు సాధించిన కాంగ్రెస్, మున్సిపల్ ఎన్నికల్లో పట్టు పెంచుకోవాలని చూస్తోంది. వీలైనన్ని ఎక్కువ స్థానాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా మంత్రులను ఇంఛార్జ్‌లుగా పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి నియమించారు. ఇంఛార్జ్ మంత్రి ఛైర్మన్‌గా లోక్‌సభ స్థానం పరిధిలోని డీసీసీ అధ్యక్షులు కన్వీనర్లుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, లోక్‌సభకు పోటీ చేసిన నేతలు, సీనియర్ - మిగతా3లో

# ఫోన్ ట్యాపింగ్‌లో ఎంతటి వారున్న శిక్ష తప్పదు




- నా ఫోన్, షబ్బీర్ అలీ ఫోన్ సహా చాలా మంది ఫోన్స్ ట్యాప్ చేసి.. ప్రైవేట్ సంభాషణలు విన్నారు
- బీఆర్ఎస్ నాయకులు.. మహిళా యాక్టర్‌ల ఫోన్లు ట్యాప్ చేసి వారి వ్యక్తిగత జీవితాల్లో తొంగి చూశారు
- తప్పు చేశారు కాబట్టే ఇలా మాట్లాడుతున్నారు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుంది.

**హైదరాబాద్**

తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపై హరీష్ విచారణపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్న శిక్ష తప్పదు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. 'కేటీఆర్ ఏమీ తెలియదు. టెలిగ్రాఫిక్ యాక్టు చదివితే ఈ కేసు తీవ్రత ఏంటో కేటీఆర్‌కు తెలుస్తుంది. - మిగతా3లో



# తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం కండి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం

2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని....

అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికా బద్ధమైన అడుగులు వేస్తున్నాం



# ఢిల్లీ ప్రజలకు గుడ్‌న్యూస్

- గ్రేడ్-4 నేపథ్యంలో విధించే కఠిన ఆంక్షలకు తాత్కాలిక సడలింపు
- ఢిల్లీ నగరం తీవ్రమైన గాలికాలుష్య సమస్యతో సతమతమవుతున్న సంగతి తెలిసిందే
- గాలి నాణ్యత గత ఆదివారం 440కి చేరుకొని అత్యంత ప్రమాదర స్థాయికి చేరుకుంది

## సంపాదకీయం

# శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ

ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.. ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంతమందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించి, జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు సరిహద్దు గాంధీ. ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు సరిహద్దు గాంధీ. బాద్షా ఖాన్ గా సరిహద్దు గాంధీ గా పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారమును పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఇతని అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. ఇతను పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారతదేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన పష్టున్ స్వాతంత్ర్య కార్యకర్త. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అతను మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు మరియు మిత్రుడు, అయన భారతదేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత అతను జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు'. 'వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉత్మాన్జైలోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్-ఇ ఇస్లా-ఇ ఆఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), మరియు 1927 లో యువ ఉద్యమమైన 'పాక్టున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత , అతను పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్టున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం యొక్క లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం ద్వారా మాత్రమే అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది, అతను 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసుకున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. వారు స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నారు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వారించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని మరియు ఖుదై ఖిద్మత్గర్, మరియు నేను మాత్రమే సేవ చేయాలను కుంటున్నాను" అని చెప్పి గౌరవాన్ని తిరస్కరించారు. అతను చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడుతుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడమని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడటానికి ప్రతిజ్ఞ చేయమని ఒప్పించాడు. అతను ఈ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అతని "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సర్వర్లు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి ఒప్పించాడు. బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారతదేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మంది శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా నిరంతరం కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాదనే అవసరమైన నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్లో పాఠశాలలను తెరిచాడు, మహిళలను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చాడు మరియు తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రతిజ్ఞ చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయనాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లింలీడర్లు, ఇతను ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు.మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశారు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు. 'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. చివరకు మీరు మమ్మల్ని నక్కల పాలు చేశారు' అని సీడబ్ల్యూసీను ఉద్దేశించి ఖాన్ వ్యాఖ్యానించాడట. సరిహద్దు ప్రాంతవాసులకు ద్వేషి అయ్యాడు, అటు దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ లు తీవ్రంగా ద్రోహం చేశాయని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు" అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది శాశ్వతంగా మిగిలిపోతుందని పిలుపునిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటూ పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్గానిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చారు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి

# ఖాళీగా ఉన్నది ఒక పోస్టు కాదు - దళితులకు మూసివేసిన ద్వారం

# రాజ్యాంగాన్ని ఖాళీ చేసే విశ్వవిద్యాలయాలు




**ధర్మఘంట, జనవరి 20, హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం (హెచ్ సి యూ)లో ఎస్సీ ప్రొఫెసర్ పోస్టును దశాబ్దకాలంగా ఖాళీగా ఉంచడం ఒక పరిపాలనా లోపం కాదు. ఇది ఒక స్పష్టమైన రాజకీయ నిర్ణయం. ఇది అకడమిక్ కఠినత కాదు; ఇది కులాధిపత్యం. ఇది తప్పిదం కాదు; ఇది వ్యవస్థ. 2014 నుంచి ఇప్పటివరకు ఎస్సీలకు కేటాయించిన ప్రొఫెసర్ పోస్టు నింపబడలేదు. 2016 నుంచి 2024 వరకూ ప్రకటనలపై ప్రకటనలు వచ్చాయి. ఇంటర్వ్యూలు జరిగాయి. స్క్రూటినీలు జరిగాయి. కానీ ఫలితం ఒక్కటే – "అర్హులు లేరు". ఈ మాట పదేళ్లపాటు పదేపదే చెప్పబడితే, అది అబద్ధం కాకపోతే మరేమిటి?

ఈ దేశంలో వందలాది విశ్వవిద్యాలయాలు, వేలాది ప్రొఫెసర్లు ఉన్నారు. అయినా ఒక అర్హుడైన ఎస్సీ ప్రొఫెసర్ దొరకలేదని చెప్పడం, దళితుల మేధస్సుపై వేసిన బహిరంగ అభిశంస. ఇది దళితులకు మాత్రమే కాదుభారత రాజ్యాంగానికే అవమానం.

ఈ కేసులో ప్రొఫెసర్ రాజశేఖర్ వ్యక్తి కావచ్చు. కానీ ప్రశ్న వ్యక్తిగతం కాదు. 50కిపైగా పీహెచ్‌డీలు, దశాబ్దాల అకడమిక్ అనుభవం, ఉపకులపతి స్థాయి పరిపాలనా నేపథ్యం ఉన్న వ్యక్తి కూడా "అర్హుడు కాదు" అనిపిస్తే, అసలు అర్హత ప్రమాణం ఏమిటి? పబ్లికేషన్లా? అనుభవమా? లేక కులమా?

ఎన్‌సిఎస్‌సి చేసిన వ్యాఖ్యలు స్పష్టంగా చెబుతున్నాయి – ఇది ఆర్టికల్స్ 15(4), 16(4), 335ల ఉల్లంఘన. కానీ అసలు ప్రశ్న ఇది: ఈ ఉల్లంఘన పదేళ్లపాటు ఎలా కొనసాగింది? వరుసగా వచ్చిన ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, అకడమిక్ కౌన్సిళ్లు – అందరూ మౌనంగా ఎలా ఉన్నారు? ఈ మౌనం నిర్లక్ష్యం కాదు. ఇది సహకారం.

రోహిత్ వేముల మరణం తర్వాత కూడా హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం మారలేదంటే, అది యాదృచ్ఛికం కాదు. అక్కడ సమస్య వ్యక్తులది కాదు. అది ఒక సంస్కృతి. దళితులు లోపలికి రాకూడదు అనే సంస్కృతి. వస్తే – విద్యార్థిగా మౌనం. అధ్యాపకుడిగా నిరాకరణ.

"వికసిత భారత్" అంటూ ఉపన్యాసాలు చెప్పే పాలక వ్యవస్థ, తన కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనే రాజ్యాంగాన్ని అమలు చేయలేకపోతే, ఆ వికాసం ఎవరి కోసం? సమానత్వం లేకుండా అభివృద్ధి ఒక మోసం. న్యాయం లేకుండా విద్య ఒక ఆయుధం.

ఇప్పుడు ప్రశ్న స్పష్టంగా ఉంది: ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఎప్పుడు నింపుతారు? బాధ్యులపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారు? లేకపోతే, ఈ దేశంలో రిజర్వేషన్ కేవలం పుస్తకాల్లో మిగిలిపోయిన నిబంధనగానే ఉంటుందా?

ఇది ఒక విశ్వవిద్యాలయం గురించిన కథ కాదు. ఇది భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాల్. దానికి సమాధానం ఉద్యమమే.

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ఎస్సీ ప్రొఫెసర్ పోస్టు: దశాబ్దకాల నిరాకరణ

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో (హెచ్ సి యూ) షెడ్యూల్డ్ కులాలకు కేటాయించిన ప్రొఫెసర్ పోస్టును దాదాపు పదేళ్లుగా ఉద్దేశపూర్వకంగా ఖాళీగా ఉంచుతున్నారనే ఆరోపణలు తీవ్రమైన చర్చకు దారితీశాయి. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్, ఈ అంశంపై హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి మరియు రిజిస్ట్రార్‌లపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్ సి ఎస్ సి) వద్ద ఫిర్యాదు చేశారు.

**కోర్ గ్రీవెన్స్ (మూల ఫిర్యాదు)**

2014 నుండి ఎస్సీలకు కేటాయించిన ప్రొఫెసర్ పోస్టును నింపకుండా ఉంచడమే ఫిర్యాదు యొక్క ప్రధానాంశం. 2016, 2019, 2021, 2022, 2023 మరియు 2024లో పలు మార్లు ప్రకటనలు జారీ చేసినప్పటికీ, ఈ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. ప్రొఫెసర్ రాజశేఖర్ 2016లో దరఖాస్తు చేసుకున్నారు. 2017 జూన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించగా, ముగ్గురు అభ్యర్థులను పిలిచినప్పటికీ ఎవరినీ అర్హులుగా గుర్తించకుండా సెలెక్షన్ కమిటీ పోస్టును ఖాళీగానే ఉంచింది. తిరస్కరణకు సంబంధించి రాతపూర్వక కారణాలు, స్పష్టమైన వివరణలు లేదా పారదర్శక రికార్డులు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు.

The Center for CONSTITUTIONAL ADVOCACY, EQUALITY AND JUSTICE

2019 నుంచి 2024 వరకూ ప్రతి ప్రకటనలోనూ విభాగ స్థాయి స్క్రూటినీ లేదా సెలెక్షన్ ప్రక్రియ ద్వారా ఒక్క ఎస్సీ అభ్యర్థినీ సిఫారసు చేయలేదని ఆరోపించారు. ఫలితంగా ఎస్సీ రిజర్వ్ చేసిన పోస్టు దాదాపు పదేళ్లపాటు ఖాళీగా ఉండిపోయింది.

**కమిషన్ ముందు ప్రొఫెసర్ రాజశేఖర్ వాదనలు**

ఎన్‌సిఎస్‌సి ముందు ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ పోస్టుకు అవసరమైన అన్ని అర్హతలు తనకు ఉన్నాయని తెలిపారు. నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న సమయంలోనే దరఖాస్తు చేయడం ద్వారా తన అకాడమిక్ స్థాయి, పరిపాలనా అనుభవం స్పష్టమవుతాయని పేర్కొన్నారు.

అన్ని నిబంధనలు పాటించినప్పటికీ, పారదర్శకమైన లేదా కారణబద్ధమైన వివరణ లేకుండా తనను తిరస్కరించారని వాదించారు. సెలెక్షన్ కమిటీ తనను అర్హుడిగా భావించలేదని అనుకున్నా కూడా, మరొక అభ్యర్థినీ నియమించకుండా పోస్టును దశాబ్దకాలం ఖాళీగా ఉంచడం ఉద్దేశపూర్వక చర్యగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పదేళ్లపాటు ఒక్క అర్హుడైన ఎస్సీ ప్రొఫెసర్ కూడా లభించలేదన్న వాదన నమ్మశక్యం కాదని, ఇది అకాడమిక్ కఠినత కాదు, సంస్థాగత వివక్షకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

**అకాడమిక్ మెరిట్ మరియు సీనియారిటీపై ప్రశ్నలు**

ప్రొఫెసర్ రాజశేఖర్ 2009లోనే ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 50కిపైగా పీహెచ్‌డీలు, 60కిపైగా ఎం.ఫిల్ విద్యార్థులను ఆయన గైడ్ చేశారు. అయితే 2014లో ప్రొఫెసర్‌గా నియమితులైన ప్రొఫెసర్ ప్రమోద్ నాయర్, అప్పటికి ఒక్క పీహెచ్‌డీ విద్యార్థినీ గైడ్ చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో, సీనియర్ ఎస్సీ ప్రొఫెసర్‌ను తిరస్కరించిన స్క్రూటినీ కమిటీ, అకాడమిక్ అనుభవం తక్కువగా ఉన్న అభ్యర్థిని ఎలా అంగీకరించిందన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అర్హతను నిర్ణయించిన అసలు ప్రమాణం ఏమిటన్నది ప్రధాన సందేహంగా నిలిచింది.

**విభాగ నియంత్రణ మరియు ప్రయోజన ఘర్షణ ఆరోపణలు**

2017 సెలెక్షన్ కమిటీతో పాటు తదుపరి స్క్రూటినీ ప్రక్రియలన్నీ ప్రొఫెసర్ ప్రమోద్ నాయర్ ప్రభావంలోనే జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2019 తర్వాత ప్రతి ప్రకటనలోనూ ఎస్సీ అభ్యర్థులు ఎంపిక కాకుండా చూసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీనియర్ దళిత ప్రొఫెసర్ నియమితులైతే విభాగంలో తన ఆధిపత్యం దెబ్బతింటుందనే కారణంతో, అటువంటి నియామకాన్ని బహిరంగంగానే వ్యతిరేకించారని కమిషన్ ముందు ఆరోపించారు. ఇది ఒక్కసారి జరిగిన తప్పిదం కాదని, నిరంతర కుల వివక్షగా వాదించారు.

**విశ్వవిద్యాలయ అధికారుల స్పందన**

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి మరియు రిజిస్ట్రార్‌లు స్పందిస్తూ, ఎంపిక బాధ్యత స్క్రూటినీ లేదా సెలెక్షన్ కమిటీకే చెందుతుందని, పరిపాలన కేవలం నిబంధనలు పాటిస్తుందే తప్ప ప్రత్యక్ష బాధ్యత లేదని తెలిపారు. అయితే ఎన్‌సిఎస్‌సి ఈ వాదనను స్పష్టంగా తిరస్కరించింది. రిజర్వేషన్ వంటి రాజ్యాంగ అంశాల్లో బాధ్యతను కమిటీలపై నెట్టివేయడం చెల్లదని కమిషన్ పేర్కొంది.

**ఎన్‌సిఎస్‌సి పరిశీలనలు**

ఎన్‌సిఎస్‌సి ప్రకారం, దాదాపు పదేళ్లపాటు ఎస్సీ ప్రొఫెసర్ పోస్టును ఖాళీగా ఉంచడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15(4), 16(4), 335లకు విరుద్ధం. విధానపరమైన కఠినతను ఆధారంగా చేసుకుని వివక్షను కొనసాగించడం అనుమతించబడదని కమిషన్ స్పష్టం చేసింది. ఈ కేసు వ్యవస్థాపిత బహిష్కరణకు ఉదాహరణగా అభివర్ణించింది.

**ఆదేశాలు మరియు తదుపరి చర్యలు**

ఈ వ్యవహారంలో యూజీసీ మరియు హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికి కమిషన్ అధికారిక ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపింది. అనవసర కఠినమైన నిబంధనల సడలింపు, ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను నిర్దిష్ట కాలపరిమితిలో నింపడం, అలాగే హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం క్యాంపస్‌పై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలన్నది కమిషన్ సూచన.

**విస్తృత సంస్థాగత నేపథ్యం**

రోహిత్ వేముల ఘటనల కాలంలోనూ హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులు, అధ్యాపకులపై వివక్ష ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో కొన్ని తీవ్రమైన ఆరోపణలను విశ్వవిద్యాలయ యంత్రాంగం దాచిపెట్టిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత కేసు ఒంటరిది కాదని, వ్యవస్థాపిత వివక్షకు మరో ఉదాహరణగా చూడాల్సిన అవసరం ఉందని విమర్శకులు అంటున్నారు.

**రాజ్యాంగ మరియు జాతీయ ప్రభావాలు**

ఈ చర్యలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16, 21లను ఉల్లంఘిస్తున్నాయని కమిషన్ అభిప్రాయపడింది. సమానత్వం, గౌరవం, సామాజిక న్యాయం వంటి విలువలకు ఇది విరుద్ధమని పేర్కొంది. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఒక అర్హుడైన దళిత ప్రొఫెసర్‌ను నియమించలేకపోయామా? లేక ఇది కుల ఆధిపత్యం, అకాడమిక్ గేట్‌కీపింగ్ ఫలితమా? అనే ప్రశ్నలు దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి. ఇటువంటి చర్యలు భారత రాజ్యాంగ ఆత్మకే కాకుండా, వివక్షలేని అభివృద్ధిని ప్రతిపాదించే 'వికసిత భారత్' భావనకూ విరుద్ధమని 'ది సెంటర్ ఫర్ కాన్స్టిట్యూషనల్ అడ్వకసీ ఫర్ ఈక్వాలిటీ అండ్ జస్టిస్' వ్యాఖ్యానించింది.

# దళిత జాతి గొంతుక భట్టి విక్రమార్కపై అసత్య కథనాల ప్రచారాన్ని వెనక్కి తీసుకోవాలి.

**ధర్మఘంట, జనవరి 20, హైదరాబాద్ :** తెలంగాణ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కపై వేమూరి రాధాకృష్ణ అసత్య తప్పుడు కథనాలను తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ కుమార్ మాదిగ తీవ్రంగా ఖండించారు. అట్టడుగు స్థాయి నుంచి ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో దళిత బహుజనుల ఆత్మగౌరవ నినాదాన్ని నిలబెడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల గొంతుకగా అనేక పర్యాయాలుగా చట్టసభలలో అట్టడుగు వర్గాల గొంతుకగా 40 సంవత్సరాల తన రాజకీయ జీవితాన్ని ఎంతో ఆదర్శంగా విలువలతో కూడిన వ్యక్తిగా ముందుకెళ్తున్న ఈ తరుణంలో దోపిడీ సామ్రాజ్య ప్రతినిధులకు జర్నలిజం ముసుగులో అనుకూల వార్తలను ప్రచారం చేస్తున్న రాధాకృష్ణ దళితుడైనటువంటి ఒక ఉప ముఖ్యమంత్రి లాంటి ఉన్నత స్థానంలో ఉన్నటువంటి మల్లు బట్టి విక్రమార్క పట్ల తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వేమూరి రాధా కృష్ణను పత్రికాముఖంగా ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పేద దళిత కుటుంబాల నుంచి ఎంతో కష్టపడి చదువుకొని మంచి రాజకీయ విలువలతోనే ఈ సమాజంలో ఓటమి ఎరుగని నాయకుడిగా చట్టసభలకు ఎంతో గౌరవాన్ని తెచ్చే విధంగా ఈనాడు ప్రజాపాలనలో వారి మార్కుని చూపి, పేదల నాయకుడిగా ముందుకెళ్తున్న ఈ పరిస్థితుల్లో ఇలాంటి అసహ్యామైనటువంటి ఆరోపణలు ఎలాంటి అవినీతి మచ్చ లేనటువంటి వ్యక్తిపై బురద చల్లడం అనేది దళిత సమాజం జీర్ణించుకోలేక పోతుందని, భట్టి విక్రమార్క పట్ల వారు చేసిన ప్రతి ఆరోపణపై, తప్పుడు కథనాలకు గాను తక్షణమే క్షమాపణ చెప్పవలసిందిగా తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి పక్షాన డిమాండ్ చేశారు.



ధర్మఘంట

# బీజేపీ చేతిలోనే దేశం సురక్షితం

భారతీయ జనతా పార్టీ చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. గత 12 ఏళ్లలో ఎన్నో రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని గుర్తు చేసుకున్నారు. తొలిసారి బంగాల్, తెలంగాణలో కూడా అధికారంలోకి రానున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీది మాత్రం ఎల్లప్పుడూ అభివృద్ధి మోడల్ అంటూ చెప్పుకొచ్చారు. దిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు వ్యాఖ్యలు చేశారు. అయితే బీజేపీలో సాధారణ కార్యకర్త కూడా పార్టీ జాతీయ అధ్యక్షుడు కాగలరని ప్రధాని మోదీ తెలిపారు. భారతీయ జనతా పార్టీ నిర్ణయాలు, ఎంపిక అన్నీ ప్రజాసామ్యయుతంగా ఉంటాయని చెప్పారు. దేశ సేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయన్నారు. కార్యకర్త కేంద్రంగా పార్టీ సిద్ధాంతాలు ఉంటాయని తెలిపారు. బీజేపీ కార్యకర్త అని అనిపించుకోవడమే తన గర్వకారణంగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు.

**పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది: ప్రధాని**

గతంలో ఎల్‌కే అద్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించామని మోదీ గుర్తు చేసుకున్నారు. అందరి కృషితోనే వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగిందని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉందని తెలిపారు. బీజేపీ చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నట్లు మోదీ తెలిపారు.

**నాయకత్వం మారినా, గమ్యం మారొద్దు!**



"బీజేపీలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. పార్టీ కోసం కృషి చేయాలి. కొత్తగా వస్తున్న మార్పులను పార్టీ అందిపుచ్చుకోవాలి, అనుసరించాలి. రేడియో నుంచి ఏఐ పరిజ్ఞానం వరకు అన్నింటినీ ఉపయోగించుకోవాలి. పార్టీ బాధ్యతలను జీవనశైలిగా భావించాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారుతాయి, లక్ష్యం మారదు. నాయకత్వం మారినా మన గమ్యం మారొద్దు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలి" అంటూ మోదీ పిలుపునిచ్చారు.

**కేరళలో కూడా అవకాశాలు**

గత 12 ఏళ్లలో ఎన్నో రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని ప్రధాని మోదీ తెలిపారు. గతంలో గెలవని రాష్ట్రాల్లోనూ ఈ 12 పన్నెండేళ్లలో గెలిచి చూపించామని అన్నారు. తొలిసారి బంగాల్, తెలంగాణలో కూడా అధికారంలోకి రానున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళలో కూడా బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని మోదీ అన్నారు. దేశంలో ఒక్కో పార్టీది ఒక్కో విధానమని, కాంగ్రెస్ పార్టీది కుటుంబ మోడల్ అంటూ విమర్శించారు. బీజేపీది మాత్రం ఎల్లప్పుడూ అభివృద్ధి మోడల్ అంటూ చెప్పుకొచ్చారు.

**నితిన్ నబీన్‌కు మోదీ అభినందనలు**


ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా తాను అభివర్ణించిన బీజేపీకి అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు నితిన్ నబీన్‌కు అభినందనలు తెలిపారు మోదీ. ఆయన బాధ్యత కేవలం బీజేపీని నిర్వహించడంతోనే ముగిసిపోదని అన్నారు. "పార్టీ విషయానికి వస్తే, నితిన్ బాస్, నేను ఒక పార్టీ కార్యకర్తను. ఇప్పుడు గౌరవనీయులైన నితిన్ నబీన్ జీ మనందరికీ అధ్యక్షుడు. ఆయన బాధ్యత కేవలం బీజేపీని నిర్వహించడం మాత్రమే కాదు, ఎన్డీఏ మిత్రపక్షాలన్నింటి మధ్య సమన్వయం ఉండేలా చూడటం కూడా" అని ప్రధానమంత్రి అన్నారు. రాబోయే దశాబ్దాల ప్రాముఖ్యాన్ని నొక్కి చెబుతూ, ప్రధాని మోదీ, "రాబోయే 25 సంవత్సరాలు చాలా ముఖ్యమైనవి. ఈ కాలంలోనే అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాల్సి ఉంది. అది జరగడం ఖాయం" అని అన్నారు. నితిన్ పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. నితిన్ నబీన్‌లో ఉన్న యువశక్తి, అనుభవం పార్టీకి పనికొస్తుందని చెప్పారు. 45 ఏళ్ల నబిన్ ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాలలో పెద్ద మార్పులను చూసిన తరానికి చెందినవారని తెలిపారు.

# తమిళనాడులో మళ్లీ గవర్నర్ Vs సర్కార్

అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ తమిళనాడులో గవర్నర్ వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారం మళ్లీ మొదలైంది. తాజాగా మంగళవారం ఉదయం అసెంబ్లీ సెషన్ ప్రారంభం కాగానే రాజకీయ రగడ రాచుకుంది. శాసన సభను ఉద్దేశించి ప్రసంగించడానికి గవర్నర్ ఆర్ఎన్ రవి అసెంబ్లీకి చేరుకున్నారు. తొలుత తమిళనాడు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం జాతీయ గీతాన్ని ప్లే చేసి, అందరూ ఆలపించాలని అసెంబ్లీ స్పీకర్ ఎం అప్పావుకు గవర్నర్ సూచించారు. అయితే అందుకు స్పీకర్ నిరాకరించారు. దీంతో అసెంబ్లీలో ప్రసంగించకుండానే గవర్నర్ ఆర్ఎన్ రవి వాకౌట్ చేశారు. అలా అసెంబ్లీ ప్రసంగించకుండా గవర్నర్ వాకౌట్ చేయండి ఇది మూడోసారి.

**మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు, మాట్లాడనివ్వలేదు : గవర్నర్ కార్యాలయం**

అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్ చేసిన వెంటనే, సభలో జరిగిన పరిణామాల వివరాలతో తమిళనాడు గవర్నర్ కార్యాలయం లోక్ భవన్ ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. 'సభలో పదేపదే గవర్నర్ ఆర్ఎన్ రవి మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు. ఆయనను మాట్లాడనివ్వలేదు. దళితులపై దాడులు, దళిత మహిళలపై లైంగిక హింసాకాండ వంటి వ్యవహారాలను గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేర్చలేదు' అని గవర్నర్ కార్యాలయం విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం తప్పులతడకగా ఉన్న ప్రసంగాన్ని తయారుచేసి గవర్నర్‌కు ఇచ్చిందని, అందుకే ఆయన ప్రసంగించేందుకు నిరాకరించారని స్పష్టం చేసింది. తమిళనాడుకు రూ.12 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులు వచ్చాయనే అంశాన్ని ప్రసంగంలో రాశారని, అది వాస్తవదూరమైన అంశమని పేర్కొంది. మరోసారి తమిళనాడు అసెంబ్లీలో జాతీయ గీతం అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని లోక్‌భవన్ పేర్కొంది. ప్రాథమిక రాజ్యాంగ విధిని అసెంబ్లీ స్పీకర్ అమలు





చేయలేదని తెలిపింది. ఈ కారణాల వల్లే అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్ చేశారని వెల్లడించింది.

**మేం ఇచ్చిన ప్రసంగాన్నే చదవాలి : సీఎం స్టాలిన్**

రాష్ట్ర అసెంబ్లీ సంస్కృతి, సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి వాకౌట్ చేశారని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. అసెంబ్లీ సెషన్ ప్రారంభంలో గవర్నర్ ప్రసంగించాలనే సంప్రదాయానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసి ఇచ్చిన ప్రసంగాన్నే గవర్నర్ చదవాల్సి ఉంటుందని, అందులో ఆయన అభిప్రాయాలను చేర్చే అవకాశమే ఉండదని సీఎం స్టాలిన్ తేల్చి చెప్పారు. ప్రసంగంలోకి గవర్నర్ అభిప్రాయాన్ని చేర్చేలా అసెంబ్లీ రూల్స్ ఏవీ లేవన్నారు. ఆర్ఎన్ రవి ఉద్దేశపూర్వకంగానే గత కొన్నేళ్లుగా ఇలా చేస్తున్నారని సీఎం ఆరోపించారు. ఈవిధంగా చేయడం రాష్ట్ర అసెంబ్లీని అవమానించడమే అవుతుందన్నారు. అందుకే రాష్ట్రానికి గవర్నర్ అక్కరలేదనే వైఖరికి డీఎంకే కట్టుబడి ఉందని స్టాలిన్ చెప్పారు. గత సీఎంలు అన్నాదురై, కరుణానిధి కూడా ఇదే విధమైన వైఖరితో పనిచేశారన్నారు. తాను కూడా వారి బాటలోనే నడుస్తున్నట్లు పేర్కొన్నారు.

**గవర్నర్ ప్రసంగించినట్టుగానే నమోదు చేయిస్తాం : సీఎం**

"తమిళనాడు ప్రజల ఓట్లతో ఎన్నికైన మెజారిటీ ప్రభుత్వాన్ని గవర్నర్ గౌరవించి తీరాలి. ఆర్ఎన్ రవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా వేదికల్లో విష ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ మాట్లాడుతానంటే ఒప్పుకోం. గవర్నర్ వాకౌట్ చేసి వెళ్లిపోయినా ఆయన ప్రసంగం ఇంగ్లిష్ కాపీని అందరు ఎమ్మెల్యేల సిస్టమ్‌లలోకి అప్‌లోడ్ చేశాం. వారంతా దాన్ని చదువుకుంటారు. అందు వల్ల గవర్నర్ ప్రసంగించినట్టుగానే అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌లో వివరాలను నమోదు చేయిస్తాం. దీనిపై అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించాం" అని సీఎం స్టాలిన్ వెల్లడించారు.

**తమిళనాడు స్పీకర్‌కు ఓంబిర్లా బర్త్‌డే విషెస్**

ఇక ఇదే సమయంలో మంగళవారం రోజు తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం అప్పావుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. ఆయురారోగ్యాలు, సకల సంపదలు, సుఖ సంతోషాలతో కలకాలం జీవించాలి అంటూ అప్పావును ఓంబిర్లా విష్ చేశారు.

**రెండేళ్లలో మూడుసార్లు వాకౌట్**

గత రెండేళ్లలో ఈవిధంగా అసెంబ్లీలో ప్రసంగించకుండానే గవర్నర్ వాకౌట్ చేయడం ఇది మూడోసారి. 2024, 2025 సంవత్సరాల్లోనూ సభలో ఆర్ఎన్ రవి ప్రసంగించలేదు. గతేడాది కూడా సభలో జాతీయ గీతాలాపన చేయలేదనే కారణంతోనే ఆయన వాకౌట్ చేశారు. ఇక రాష్ట్రంలోని శాంతిభద్రతలు గాడి తప్పాయని ఆరోపిస్తూ అన్నా డీఎంకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. పార్టీ జనరల్ సెక్రెటరీ ఎడప్పాడి కే పళనిస్వామితో కలిసి వారు అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

# అరైవ్ అలైవ్2026 రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు





**జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**ధర్మఘంట జనవరి 20 నల్లగొండ:**జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్-అలైవ్2026) కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు,యువత, ఆటో డ్రైవర్లు,ఆర్టీసీ బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.నల్గొండ జిల్లా పరిధిలో గత సంవత్సరం నమోదైన గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 900 నుంచి 950 వరకు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా,అందులో దాదాపు 360 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.ఈ మరణాల్లో సుమారు 90 శాతం మంది ద్విచక్ర వాహనదారులే కాగా,వారిలో హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణమని వెల్లడించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఎంతో ఎక్కువగా ఉంటుందని,హెల్మెట్ అనేది కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాకుండా ప్రాణ రక్షణకు అత్యంత కీలకమైన సాధనమని స్పష్టం చేశారు.అలాగే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం,మద్యం సేవించి వాహనం నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్),ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన,మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం,మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి అంశాలను వివరించారు.ఇవన్నీ నియంత్రిస్తే ప్రమాదాల శాతం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు.18 సంవత్సరాలు నిండకముందే వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్నారు. అలాగే మద్యం సేవించి వాహనం నడిపితే కేవలం డ్రైవర్‌కే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని,అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని,ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్పీ తెలిపారు.ట్రాఫిక్ నియమాలను పాటిస్తే తాము సురక్షితంగా ఉండటమే కాకుండా,ఇతరుల ప్రాణాలను కూడా కాపాడిన వారవుతామన్నారు.పోలీసులు శిక్షించడానికి కాదు,ప్రజల ప్రాణాలను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు.ఈ అవగాహనా సదస్సులో రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు తక్షణ ప్రాథమిక చికిత్సలో భాగంగా డాక్టర్ ద్వారా సీపీఆర్ పై అవగాహన కల్పించారు.ప్రమాదరహిత ప్రయాణానికి ప్రతి ఒక్కరం కృషి చేస్తామని పాల్గొన్న వారందరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,ఎస్బి డీఎస్పీ మల్లారెడ్డి,నల్లగొండ డీఎస్పీ శివారెడ్డి,2 టౌన్ సీఐ రాఘవరావు,1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,ఎస్బి సీఐ రాము,ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య,2 టౌన్ ఎస్ఐ సైదులు,రూరల్ ఎస్ఐ సైదా బాబు,ఆర్టీసీ డియం డీటీఆర్‌బీ రిటైర్డ్ సీఐ అంజయ్య తదితర పోలీస్ అధికారులు,సిబ్బంది, ఆటో డ్రైవర్లు,బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఢిల్లీ ప్రజలకు గుడ్‌న్యూస్

**ఢిల్లీ :** దేశ రాజధాని వాసులకు వాసులకు ఎయిర్ క్వాలిటీ మెనేజ్‌మెంట్ శుభవార్త తెలిపింది. అక్కడి వాయికాలుష్య తీవ్రత గతంతో పోలిస్తే కొంతమేర తగ్గినట్లు పేర్కొంది. దీంతో గ్రేడ్-4 నేపథ్యంలో విధించే కఠిన ఆంక్షలకు తాత్కాలిక సడలింపు ఇస్తున్నట్లు పేర్కొంది. ఢిల్లీ నగరం తీవ్రమైన గాలికాలుష్య సమస్యతో సతమతమవుతున్న సంగతి తెలిసిందే. గాలి నాణ్యత గత ఆదివారం 440కి చేరుకొని అత్యంతప్రమాదర స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో గ్రేడ్-4కు విధించే కఠిన ఆంక్షలు విధిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ రోజు ఉదయం గాలినాణ్యత 378గా నమోదైంది. దీంతో ఆంక్షలకు తాత్కాలిక సడలింపు ఇచ్చింది. అయితే గ్రేడ్-4 ఆంక్షల సమయంలో నగరంలో కఠిన ఆంక్షలు ఉంటాయి. నిర్మాణ రంగ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోతాయి. అత్యవసరమైతే తప్ప డీజిల్ ట్రక్కులను నగరంలోకి అనుమతించరు. జనరేటర్లతో నడిచే పరిశ్రమలను తాత్కాలికంగా నిలిపివేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ సిఫారసు చేస్తారు. కాగా సాధారణ సమయంలోనే వాయు కాలుష్యం అధికంగా ఉండే ఢిల్లీలో శీతాకాలంలో దాని ప్రభావం మరింత అధికంగా ఉంటుంది.

## సత్యం కుంభకోణం మరోసారి తెరపైకి..

**రామలింగరాజు సహా 213 మందికి ఈడీ కోర్టు నోటీసులు**

**ముంబై :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, దేశ కార్పొరేట్ రంగాన్ని కుదిపేసిన సత్యం కంప్యూటర్స్ కుంభకోణం మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈ స్కామ్‌తో ముడిపడి ఉన్న జన్వాడ భూముల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రత్యేక కోర్టు.. సత్యం వ్యవస్థాపకుడు బైర్రాజు రామలింగరాజు, ఆయన కుటుంబ సభ్యులు నందిని రాజు, తేజ రాజులతో పాటు మొత్తం 213 మందికి నోటీసులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.ఈ కేసులో ఏ-153గా ఉన్న శతభిష కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేసిన అభినవ్ అల్లాడి (ఏ-12) అనే వ్యక్తి ఇటీవల ఈడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. జన్వాడ భూముల కొనుగోళ్లలో జరిగిన మోసపూరిత లావాదేవీల గురించి తనకు పూర్తి సమాచారం తెలుసని, తన వాంగ్మూలాన్ని సాక్షిగా నమోదు చేసుకోవాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. సత్యం స్కామ్ ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయలను హైదరాబాద్ శివార్లలోని విలువైన భూముల కొనుగోలుకు మళ్లించారని ఆయన తన పిటిషన్‌లో ఆరోపించారు.ప్రధానంగా, శంషాబాద్ సమీపంలోని జన్వాడ గ్రామ పరిధిలో సర్వే నంబర్లు 306 నుంచి 316 మధ్య ఉన్న సుమారు 90 ఎకరాల భూమిని శతభిష కంపెనీ, దాని డైరెక్టర్లు మోసపూరితంగా కొనుగోలు చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ భూముల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.5,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కొందరు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులతో కుమ్మక్కై, రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి బినామీ లావాదేవీలకు పాల్పడ్డారని ఆరోపించారు.మనీ లాండరింగ్ నిరోధక చట్టం (ఖఓఒం) ప్రకారం ఈ భూములను నేరపూరిత ఆస్తులుగా గుర్తించాల్సి ఉన్నప్పటికీ, ఈడీ అధికారులు కొందరితో కుమ్మక్కై అలా చేయలేదని వాదించారు. ఈ మోసంలో తాను కూడా బాధితుడినేనని, అసలు భూ యజమానులతో ఒప్పందాలు చేసుకుని తాను కూడా నష్టపోయానని అభినవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది.2009లో వెలుగుచూసిన సత్యం కంప్యూటర్స్ కుంభకోణంలో కంపెనీ ఖాతాలను తారుమారు చేసి, షేర్ల ధరలను కృత్రిమంగా పెంచి రామలింగరాజు భారీ మోసానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో ఆయనకు జైలు శిక్ష కూడా పడింది. ఇప్పుడు జన్వాడ భూముల రూపంలో ఈ కేసు మళ్లీ తెరపైకి రావడం సర్వత్రా ఆసక్తిని రేపుతోంది.

## భారత్‌లోకి పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్ లలోగో బెలూన్- భద్రతాసంస్థలు అలర్ట్





పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ లైన్స్ (పీఐఏ) లోగో కలిగిన విమానం ఆకారపు బెలూన్ హిమాచల్‌ప్రదేశ్‌లో కలకలం రేపింది. కులు జిల్లా బష్లా గ్రామంలోని ఓ రైతు పొలంలో పాకిస్థాన్ విమానయాన గుర్తుతో ఒక అనుమానాస్పద బెలూన్ కనిపించింది. దీంతో భయాందోళనలకు గురైన స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడకి చేరుకుని ఆ బెలూన్ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బష్లా గ్రామంలోని రజనీ అనే మహిళా రైతు తన పొలంలో బెలూన్‌ను మొదటగా చూశారు. దీనిని చూసి భయపడిన ఆమె గ్రామ సర్పంచ్ జోగింద్ర థాకూర్‌కు సమాచారమిచ్చారు. దీంతో ఆయన ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో, వారు దాన్ని ఎవరూ తాకవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని బెలూన్‌ను స్వాధీనం చేసుకుని దానిపై విచారణ చేపట్టారు. ఆ బెలూన్‌ను పరిశీలించిన పోలీసులు దానిపై 'పీఐఏ' లోగోతో పాటు ఉర్దూ, ఇంగ్లిష్‌లో 'ఎస్‌జీఏ' అని రాసి ఉన్నట్లు వివరించారు. అయితే, ఇలా జరగడం ఇదే మొదటి సారి కాదని, గత కొన్నేళ్లుగా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ లోగోతో ఉన్న బెలూన్లు లభించాయని పోలీసులు వెల్లడించారు. కాగా, ఇప్పటి వరకూ ఆ బెలూన్లు ఎలా వస్తున్నాయి? వాటి వెనుక ఉన్న ఉద్దేశమేంటి? అనేది తెలియడం లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని తాము అంత తేలికగా తీసుకోబోమని, తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దీనిపై కులు సూపరింటెండెంట్ మదన్ లాల్ కౌశల్ మీడియాతో మాట్లాడారు. "మేము స్వాధీనం చేసుకున్న బెలూన్‌పై ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తులో ఎలాంటి చిప్‌గానీ, గూఢచారానికి సంబంధించిన ఇతర అనుమానాస్పద పరికరాలు ఆ బెలూన్‌లో లభించలేదు. దీని గురించి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నాం. ప్రజలకు ఏవైనా అనుమానాస్పద వస్తువులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశాం" అని ఆయన వివరించారు.

**మైనర్లను గూఢచర్యానికి ప్రేరేపిస్తూ**

అంతకుముందు ఇటీవల పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్న 15 ఏళ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌కు చెందిన మైనర్లతో గూఢచర్యం నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి ఐఎస్ఐ ఏజెంట్లు కుట్ర పన్నినట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్, పంజాబ్, హరియాణాకు చెందిన పలువురు మైనర్లను ట్రాప్ చేసి, ఉగ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా వారు ప్రేరేపిస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు హరియాణా, పంజాబ్‌కు చెందిన 12 మంది, జమ్మూకశ్మీర్‌కు చెందిన 25 మంది మైనర్లను ఐఎస్ఐ ఏజెంట్లు ట్రాప్ చేసినట్లు గుర్తించామని తెలిపారు. వారి కదలికలపై దర్యాప్తు బృందాలు నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. వీరంతా 14 నుంచి 17 ఏళ్లలోపు వారేనన్నారు. మొదట పాక్ హ్యాండ్లర్లు మైనర్ల ఫోన్‌లకు లింక్‌లు పంపిస్తున్నారని, వాటిని క్లిక్ చేయగానే వారి ఫోన్‌లను క్లోన్ చేస్తున్నారని చెప్పారు. వారి ఫోన్లు క్లోన్ చేసి ఉండడంతో బాలురు తమ ఫోన్‌లలో సేవ్ చేసే కంటెంట్‌ను వారి ప్రమేయం లేకుండానే హ్యాండ్లర్లు సేకరిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న బాలుడి ఫోన్‌ను స్కాన్ చేయగా అతడు పాక్‌కు చెందిన ఐఎస్ఐ ఆధారిత ఏజెన్సీలు, ఉగ్రవాద గ్రూపుల నిర్వాహకులతో పలుమార్లు సంప్రదింపులు జరిపినట్లు తేలిందని చెప్పారు. వారి సూచనల ఆధారంగా అతడు సైనిక స్థావరాల వీడియోలను చిత్రీకరిస్తున్నట్లు, భద్రతా కాన్వాయ్‌ల కదలికలను లీక్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఐఎస్ఐ ఏజెంట్లతో సంప్రదింపుల కోసం అతడు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటువంటి ప్రమాదకర ముఠాల చేతిలో పడకుండా పిల్లలను రక్షించాలంటే, తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని పోలీసులు సూచించారు.

# ఆధునికతతో పాటు సంప్రదాయం



**వరంగల్ :** మేడారం జాతర తెలంగాణలో ములుగు జిల్లాలో ఓ చిన్న గ్రామమైన మేడారంలో రెండేళ్లకోసారి జరిగే భారీ గిరిజన ఉత్సవం. సమ్మక్క, సారలమ్మ అనే ఇద్దరు దేవతలను పూజించే వేడుక. ఈ దేవతలు గిరిజనులకు ధైర్యం, రక్షణ, ప్రకృతికి సంబంధించిన చిహ్నాలుగా పూజలందుకుంటున్నారు. ఈ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరొందింది. కేవలం గిరిజనులు, తెలంగాణ వాసులు మాత్రమే కాదు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు

**తొలినాళ్లలో జాతర ఎలా జరిగేది?**

జాతర మూలాలు 13వ శతాబ్ధంలో కాకతీయుల కాలానికి చెందినవి. గిరిజన నాయకులు అడవిలో వేటాడుతుండగా ఓ శిశువు (సమ్మక్క) చుట్టూ పులులు రక్షణగా నిలిచి కనిపించాయి. ఈ చిన్నారిని తీసుకెళ్లి పెంచారు గిరిజనులు,ఆ చిన్నారి పెరిగి పెద్దైన తర్వాత పగిడిద్దరాజును వివాహం చేసుకుంది. వారికి సారలమ్మ (సారక్క), నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం. కాకతీయరుద్రుడు కరువు కాలంలో గిరిజనులపై పన్నులు ఆంక్షలు విధించాడు. దీనికి వ్యతిరేకంగా సమ్మక్క, సారలమ్మ నాయకత్వంలో గిరిజనులు తిరుగుబాటు చేశారు. ఆ యుద్ధంలో జంపన్న సంపెంగవాగులో దూకి మరణించాడు..అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు. సమ్మక్క సారలమ్మ అడవిలో మాయమయ్యారు. అక్కడ కుకుమ భరిణె కనిపించింది. వారి ధైర్యసాహసాలు గిరిజనుల్లో ఆరాధనా భావాన్ని పెంచాయి. కొన్ని కథల్లో ఇది యుద్ధంకాకుండా ప్రకృతి రక్షణ, ఆధ్యాత్మిక శక్తులకు సంబంధించినదిగా చెబుతారు. ఆరంభంలో ఈ ఉత్సవం గిరిజనులకు మాత్రమే పరిమితమై ఉండేది. 1930కి ముందు బక్కయ్యపేట అనే గ్రామంలో చిన్న చిన్న సమావేశాలుగా జరిగేది. కరువు, స్థలం కొరత కారణంగా ఈ సమావేశాలు 1935లో మేడారానికి మార్చారు

ఆ తర్వాత గిరిజనులుతో పాటూ ఇతర సమాజాల వారు కూడా అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ప్రారంభించారు 1990లో ప్రభుత్వం నుంచి జాతరకు గుర్తింపు లభించింది

2012లో మేడారం జాతరు కోటిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు

ఇప్పుడు దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణగా మారిన మేడారం జాతరను తెలంగాణ కుంభమేళా అని పిలుస్తున్నారుగిరిజన యువత ఈ సంస్కృతిని కాపాడుకుంటూ వేడుక జరుపుకుంటున్నారు. హిందువుల ఆచారాలతో మిళితమై ఉన్నా గిరిజన మూలాన్ని కాపాడుకుంటూ జాతర నిర్వహిస్తున్నారుమేడారం జాతర ఆరంభంలో కేవలం కోయ గిరిజనులు మాత్రమే పాల్గొనేవారు. అడవీ ప్రాంతంలో అతి కొద్దిమంది సందడి మధ్య జాతర సాగేది. సమ్మక్క సారలమ్మను పూజించేందుకు చెట్టు కింద గద్దెలు ఏర్పాటు చేసి పూజించేవారు. సమ్మక్క-సారలమ్మ వీరత్వాన్ని కథల రూపంలో చెప్పుకునేవారు. బెల్లం, కొబ్బరి, జంతుబలులు నివేదించేవారు. ఆటపాటలు, గిరిజన నృత్యాలతో ఆనందంగా జరిగేది జాతర. రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఎడ్ల బండ్లు కట్టించుకుని వచ్చేవారు. జనవరి ఆఖర్లో లేదంటే ఫిబ్రవరిలో జరుగుతుంటుంది మేడారం జాతర. భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రోడ్లు, నీరు, విద్యుత్, హెలిప్యాడ్లు, బస్ స్టాండ్లు, భద్రత సహా అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. దేవతలను అడవి నుంచి గద్దెలపైకి తీసుకురావడం ప్రధాన ఆచారం. ఇందుకోసం కోయబాలుడు ఉపవాసం ఉండి కుంకుమ భరిణె వెతికి గద్దెలపైకి తీసుకొస్తారు. భక్తులు బంగారం ( బెల్లం) తమ బరువుకు సమానంగా నైవేద్యంగా సమర్పిస్తారు. జంపన్నవాగులో స్నానమాచరిస్తే ధైర్యం పెరుగుతుందని భక్తుల నమ్మకం. జాతర నాలుగు రోజులు ఇసుకేస్తే రాలనంతమంది భక్తులతో నిండిపోతుంది ఆ ప్రాంగణం. గిరిజన సంస్కృతిని, చరిత్రను ప్రతిబింబించే ఈ జాతర ఆధునికత మిళితమైనా ఆత్మను కోల్పోకుండా వైభవంగా జరుగుతోంది.

# మంత్రుల చుట్టూ వరుస వివాదాలు

**హైదరాబాద్ :** రకరకాల ఆరోపణలు.. రకరకాల వివాదాలు.. తెలంగాణ మంత్రుల చుట్టూ కనిపిస్తున్న పరిణామాలు ఇవే.! ఇవిప్పుడు మరింత రచ్చకెక్కాయా అనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయం పొగలు కక్కుతోంది. మంత్రుల మధ్య విభేదాలు, వివాదాలు.. ఉన్నతాధికారులకు శాపంగా మారుతున్నాయా? మంత్రుల తీరుపై నిఘా పెట్టిన సీఎం రేవంత్.. పూర్తి స్థాయిలో ఆరా తీయడం స్టార్ట్ చేశారా? అసలేం జరుగుతోంది..జూపల్లి నుంచి ఇప్పుడు భట్టి వరకు.. తెలంగాణలో మంత్రుల చుట్టూ వరుస వివాదాలు కనిపిస్తున్నాయ్. మరికొందరు మంత్రులపై వినిపిస్తున్న ఆరోపణలు.. ఇంకొందరు మంత్రుల మధ్య కనిపిస్తున్న విభేదాలు.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తున్నాయ్. ఈ పరిణామాలు సీఎం రేవంత్‌కు కొత్త తలపోటుగా మారుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ మధ్యే ఓ మంత్రిపై కథనం ప్రసారం కావడం..తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా కాక పుట్టించగా.. ఇప్పుడు ఆ వివాదం కొత్త మలుపు తీసుకుంది. బొగ్గు గనుల వ్యవహారం తెరమీదకు వచ్చింది. మంత్రుల మధ్య విభేదాలకు, లీక్‌లకు కూడా.. బొగ్గు బ్లాక్‌ల వ్యవహారమనే గుసగుసలు వినిపించడం.. కథనాలు రావడంపై ఇప్పుడు తెలంగాణలో కొత్త చర్చ మొదలైంది. ఇది అటు తిరిగి.. డిప్యూటీ సీఎం భట్టి టార్గెట్ అయ్యేలా చేసింది. దీంతో ఆయన స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు. ఆ గనుల కోసం కొత్తగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.ఇప్పుడు డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. గతంలో మరికొందరు మంత్రుల చుట్టూ ఇలాంటి ఆరోపణలు, వివాదాలే వినిపించాయ్. సీనియర్ ఐఏఎస్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వి, ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య వివాదం.. అప్పట్లో తెలంగాణ రాజకీయాల్లో కాక పుట్టించింది. రిజ్వి తన ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోపించిన జూపల్లి.. స్వయంగా ఓ లేఖ రాయడం అప్పట్లో కలకలం రేపింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్‌లో ట్విస్టుల మీద ట్విస్టులు కనిపించాయ్.రిజ్వి వీఆర్ఎస్ ఆమోదించొద్దంటూ సీఎస్‌తో పాటు సీఎంకు జూపల్లి మరో లేఖ రాయడం.. విభేదాలను మరింత బహిర్గతం చేసినట్లు అయింది. ఇక అటు మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు.. హస్తం పార్టీలో కొద్దిరోజుల కింద క్రియేట్ చేసిన తుఫాన్ అంతా ఇంతా కాదు.

సీఎం రేవంత్, సలహాదారు నరేందర్ రెడ్డిపై తీవ్ర



ఆరోపణలు..

మాజీ ఓఎస్డీ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లినప్పుడు.. సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయ్. సీఎం రేవంత్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి.. తన తల్లిదండ్రులపై కుట్ర చేస్తున్నారంటూ సుస్మిత ఘాటు విమర్శలు చేశారు. కొండా సురేఖ, మురళికి ఏం జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో ఇటు కాంగ్రెస్ పార్టీలో.. అటు అధికారవర్గాల్లో తీవ్ర దుమారం రేగింది. ఈ పరిణామాల మధ్య జరిగిన కేబినెట్ భేటీకి కూడా సురేఖ దూరంగా ఉండడం.. విభేదాలను మరింత స్ట్రాంగ్ చేసింది.ఆ తర్వాత కొండా సురేఖ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దీనికి ముందు.. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటికి.. దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ మధ్య వివాదాలతో.. జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. ఇద్దరు మంత్రుల పంచాయితీ ఢిల్లీ హైకమాండ్ వరకు వెళ్లింది.ఇక మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో.. మంత్రి పొంగులేటికి విభేదాలు ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయ్. చివరికి ఓ ప్రభుత్వ భూమి విషయంలో కోర్టులో పిటిషన్ వేసే వరకు వెళ్లింది పంచాయితీ. ఇలా ఒకదాని తర్వాత ఒకరు వివాదాలు తెరమీదకు వస్తుంటే.. ఒకరి తర్వాత ఒకరిపై వరుసగా ఆరోపణలు వినిపిస్తున్నాయ్. కట్ చేస్తే ఎక్కడో పుట్టిన వివాదం.. రకరకాల మలుపులు తిరిగి.. బొగ్గు గనుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి చుట్టూ ఆరోపణలు వినిపించగా.. సీఎం రేవంత్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు.వరుస వివాదాలు, ఆరోపణలు.. ప్రతిపక్షానికి ఆయుధంగా మారి.. పార్టీని ఇరుకున పెట్టేలా కనిపిస్తున్నాయ్. దీంతో సీఎం రేవంత్ వీటిపై నజర్ పెంచినట్లు తెలుస్తోంది. ప్రతీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో ఆరా తీస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక అటు మంత్రులపై వచ్చే ఆరోపణలకు వివరణ కావాలంటే.. తనను అడగాలంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది.

## ధనికుల కోసం పార్టీల వెతుకులాట

**వరంగల్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు కాసులున్నోళ్లకే కౌన్సిలర్ టికెట్ ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందుకోసం ధనికులను గుర్తించి వార్డుల వారీగా అభ్యర్థులను ఎంపిక చేయడానికి కసరత్తు మొదలెట్టినట్లు విస్తృతంగా ప్రచా రం సాగుతోంది. ఇంతకాలం పార్టీ జెండాలు మోసిన సామాన్య కార్యకర్తలకు, నాయకులకు పైసల్లేవనే సాకు తో టిక్కెట్ ఇవ్వకుండా 'మొండి చెయ్యి' చూపిస్తూ, పోటీకి నిలబెట్టేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి.చిన్న మున్సిపాలిటీలో అయితే కనీసం 15 లక్షల నుండి 20 లక్షల రూపాయలు ఖర్చు చేసే స్తోమత ఉన్న వారికే టిక్కట్ల కేటాయింపులో మొదటి ప్రా ధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నా యి. ఇక రిజర్వేషన్ల ప్రకారం ఆయా వార్డు కౌన్సిలర్ పదవితోపాటు మున్సిపల్ చైర్ ప ర్సన్ పదవికి ఎన్నికకు రెండు నుంచి మూ డు కోట్లకు తక్కువ కాకుండా ఖర్చు పెట్టే వారిని తెరపైకి తెస్తున్నారు.రాజకీయాల్లో ఇప్పటివరకు ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్న వారికి రిజర్వేషన్ల కారణంగా పూ ర్తి చేసే అవకాశం లేని నేతలు తమ స్నే హితులు, బందు వర్గాన్ని ఎన్నికల బరిలో నిలపడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. డబ్బులు ఖర్చు పెట్టే స్తోమత ఉండి రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నవారికి పార్టీల నేత లు అన్ని మేము చూసుకుంటాం.. గెలిపించి పదవిలో కూర్చోబెడతామంటూ 'గాలం' వే స్తున్నట్లు ప్రచారం సాగుతుంది.ఉమ్మడి వ రంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. మేడారంలో నిర్వహించిన రాష్ట్ర క్యాబినెట్లో ఎంత వీలైతే అంత తొందరగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో మున్సిపల్ ఎ న్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావచ్చనే సంకేతాలు వెలువడ్డాయి. దీనితో అధి కార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష, ఇతర రాజకీయ పార్టీలు మున్సిపల్ ఎన్నికల సంగ్రామంలో విజయం సా ధించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.ఆర్థిక, అంగ బలం, రాజకీయ చతురత కలిగిన నేతలను, గెలుపు గుర్రాలను గుర్తిస్తూ ఎన్నికల బరిలో నిలపడానికి శ్రీకారం చుట్టాయి.

## ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం..

-మొదటిపేజీ తరువాయి

ఏదో ఒక కేసులో నన్ను ఇరికించాలని సీఎం ప్రయత్నిస్తున్నారు. చట్టాలను గౌరవిస్తా.. ఎన్నిసార్లు విచారణకు పిలిచినా హాజరవుతా" అని హరీశ్‌రావు అన్నారు.

**నా విచారణ వీడియో మొత్తం బయటపెట్టాలి..**

"రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుంభకోణాల నిలయంగా మారింది. గ్యారంటీలను గాలికొదిలి దండుపాళ్యం ముఠాలా దోచుకుంటోంది. కాంగ్రెస్ సర్కార్ స్కామ్‌లపై ఎక్కడైనా చర్చకు సిద్ధం. ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఇవాళ్టి విచారణపై మీడియాకు ప్రభుత్వం లీక్‌లు ఇచ్చే అవకాశం ఉంది. ధైర్యం ఉంటే నా విచారణ వీడియో మొత్తం బయటపెట్టాలి. మాకు ఇచ్చే నోటీసులు మీ పతనాన్ని వేగవంతం చేస్తాయి" అని హరీశ్ రావు అన్నారు.

**ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం..**

సిట్ విచారణలో తనను అడగడం కాదు.. తానే వారిని చాలా ప్రశ్నలు అడిగినట్లు హరీశ్‌రావు అన్నారు. మీడియా సమావేశం అనంతరం ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం. నేను హోంమంత్రిగా చేయలేదు కదా. అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డిని, అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిని విచారణకు పిలవాలని చెప్పాను" అని అన్నారు.

## నియోజకవర్గానికో స్క్రీనింగ్ కమిటీ

-మొదటిపేజీ తరువాయి

నాయకులతో స్క్రీనింగ్ కమిటీ వేస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికతో పాటు అభ్యర్థి గెలుపు వ్యూహరచనపైనా స్క్రీనింగ్ కమిటీలు కీలకంగా పని చేయనున్నట్లు తెలుస్తోంది.

**పార్టీ నాయకుల మధ్య సఖ్యత ఏది?**

పార్టీలో లుకలుకల పైనా కాంగ్రెస్ దృష్టి సారించింది. ఇంఛార్జ్ మంత్రుల నేతృత్వంలో నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు పరిష్కరించాలని నిర్ణయించింది. ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం జరుగుతున్న నియోజకవర్గాల్లో పార్టీ నాయకుల మధ్య సఖ్యత లేదు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే చెప్పిన పనులు అవుతుండగా, ఇంఛార్జ్ మాట చెల్లుబాట కాకపోవడంతో విభేదాలు తలెత్తుతున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో బయట నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యతనిస్తూ పార్టీని నమ్ముకుని ఉన్న తమకు ప్రాధాన్యత ఇవ్వట్లేదంటూ పీసీసీ, క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదులు అందుతున్నాయి.

**చిన్న సమస్యే అని వదిలేస్తే ఓటమే!**

తమ సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జీ మంత్రులు సమయం కేటాయించట్లేదని నియోజకవర్గ బాధ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గద్వాల్, చేవేళ్ల, జగిత్యాల, పటాన్‌చెరు, బాన్సువాడ, నల్గొండ, ఖమ్మం, వరంగల్‌లో నేతల మధ్య విభేదాలు ఎక్కువగా ఉన్నట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చినా రానట్లే ఉందని కొందరు సీనియర్లు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. నాయకుల మధ్య విభేదాలు చిన్న సమస్యే అని నిర్లక్ష్యం చేస్తే, మున్సిపల్ ఎన్నికల్లో నష్టం జరుగుతుందని సీనియర్లు హెచ్చరిస్తున్నారు.

**నోటిఫికేషన్ విడుదలైన 15 రోజులకే**

రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఒకే దఫాలో ఎన్నికలు జరపాలని ఈసీ భావిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత 15 రోజుల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తైన తర్వాత రెండ్రోజులకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగి ఎన్నికలకు ఆటంకం కలిగితే మరుసటి రోజు రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఆ తర్వాత రోజు అధికారులు ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తారు. ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఎన్నికైన కార్పొరేటర్లతో మేయర్, డిప్యూటీ మేయర్, వార్డు కౌన్సిలర్లతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు జరిపి ఫలితాలను ప్రకటిస్తారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో ఎంతటి వారున్న శిక్ష తప్పదు

-మొదటిపేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్న శిక్ష తప్పదు. నా ఫోన్, షబ్బీర్ అలీ ఫోన్ సహా చాలా మంది ఫోన్స్ ట్యాప్ చేసి.. ప్రైవేట్ సంభాషణలు విన్నారు. బీఆర్ఎస్ నాయకులు.. మహిళా యాక్టర్‌ల ఫోన్లు ట్యాప్ చేసి వారి వ్యక్తిగత జీవితాల్లో తొంగి చూశారు. తప్పు చేశారు కాబట్టే ఇలా మాట్లాడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పులపై విచారణ జరుగుతోంది. ఇది రాజకీయ వేధింపులు కానే కాదు, వేధింపులకు పాల్పడాలంటే రెండేళ్ల వరకు ఎందుకు వేచి చూస్తాం. అప్పుడే జైలుకు పంపే వాళ్లం అని వ్యాఖ్యలు చేశారు. మరోవైపు.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ..'గతంలో నా ఫోన్ ట్యాప్ అయ్యిందని నన్ను కూడా విచారణకు పిలిచారు. నా కుటుంబ సభ్యులు, మా ఇంటి వాచ్‌మెన్ ఫోన్ కూడా ట్యాప్ చేశారు. బీఆర్ఎస్ హయంలో నాపైనే అధికంగా కేసులు పెట్టారు. గాంధీభవన్ లోపలికి వచ్చి మరీ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నేతలను విచారణ చేయవద్దని చట్టం ఏమైనా ఉందా? అంటూ ప్రశ్నించారు.

## తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం కండి



**హైదరాబాద్:** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి "తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. మంగళవారం వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో భాగంగా దావోస్ లో ఏర్పాటు చేసిన "ఇండియా పెవిలియన్" ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణతో కలిసి పని చేయడంతో పాటు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవాలని పారిశ్రామికవేత్తలను శ్రీధర్ బాబు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని.... అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికా బద్ధమైన అడుగులు వేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేశామని మంత్రి తెలిపారు.


ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలు, అవకాశాలు, ఇక్కడి ఎకో సిస్టం వివరాలు మంత్రి పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దావోస్ వేదికగా తమ ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించిందని మంత్రి తెలిపారు. 2026లో కూడా అదే స్ఫూర్తితో పారిశ్రామికాభివృద్ధికి ఉత్తమిచ్చేలా రూపొందించిన పాలసీలను వివరించి, దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. "తెలంగాణ బ్రాండ్" మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా లైఫ్ సైన్సెస్ పాలసీ 2.ు, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్(టీఏఐహెచ్)ను దావోస్ వేదికగా లాంఛనంగా ఆవిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు.

# ఎముకలకు పుష్టినిచ్చే ఆహారాలు




చలి కాలంలో ఎముకలు, కీళ్ళు నొప్పులు తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా అరవై ఏళ్లు పైబడిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో యువత కూడా కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి అతిపెద్ద కారణం కాల్షియం లోపం. అందుకు కారణం ప్రోటీన్ కు ఇచ్చిన ప్రాముఖ్యత కాల్షియంకు ఇవ్వకపోవడమే. నేటి జీవనశైలి కారణంగా ఉదయం ఎండలో నడిచేవారే కరువయ్యారు. దీంతో శరీరంలో విటమిన్ డి లోపం తలెత్తుతుంది. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఎముకలు పెళుసుగా మారుతాయి. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉండేవారికి కూరగాయల ద్వారా పుష్కలంగా కాల్షియం అందుతుంది. అవేంటో తెలుసుకుందాం. నువ్వులలో ఆరు రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో వీటిని సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. 100 గ్రాముల నువ్వులలో దాదాపు 975 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. నువ్వుల లడ్డులు, చట్నీలు, సలాడ్లలో కలిపి తినవచ్చు. శీతాకాలంలో క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. అలాగే శీతాకాలంలో లభించే ఆకుకూరల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. పాలకూరలో కాల్షియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరుస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. కిడ్నీ బీన్స్, చిక్‌పీస్‌లో కూడా కాల్షియం అధికంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. ఒక కప్పు ఉడికించిన శనగల్లో 80 నుండి 100 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది ప్రోటీన్, ఫైబర్, ఐరన్‌ను కూడా అందిస్తుంది. చల్లని చిక్‌పీస్, కిడ్నీ బీన్స్‌తో తయారు చేసిన వంటకాలు ఎముకలకు బలాన్నిస్తాయి. ఎండిన అంజీర్ పండ్లలో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు బలంగా ఉంటాయి. రోజుకు 4 నుండి 5 ఎండిన అంజీర్ పండ్లను తినడం వల్ల అవి శరీరానికి కాల్షియం అవసరాన్ని సులభంగా తీరుస్తాయి. బాదం.. శరీరంలో కాల్షియం పనితీరును మెరుగుపరుస్తుంది. బాదం మెదడుతో పాటు ఎముకలకు కూడా మంచిది. 100 గ్రాముల బాదంలో సుమారు 260 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుంది. చల్లని వాతావరణంలో రోజూ 5 నుంచి 7 బాదం పలుకులు నానబెట్టి తినడం వల్ల చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల రాగులు.. మూడు గ్లాసుల పాలలో ఉన్నంత శక్తిని కలిగి ఉంటాయి. ఎందుకంటే కేవలం 100 గ్రాముల రాగులతో శరీరానికి సుమారు 350 మిల్లీ గ్రాముల కాల్షియం అందుతుంది. పిల్లలు నుంచి మహిళలు, సీనియర్ సిటిజన్లు.. ఇలా అందరికీ రాగులతో ప్రయోజనాలు ఉన్నాయి.

# గాఢ నిద్రలో అకస్మాత్తుగా మేల్కొంటున్నారా?



రాత్రిపూట తరచుగా మేల్కొంటుంటే, దానిని తేలికగా తీసుకోకండి. పడుకున్న తర్వాత 7 నుండి 8 గంటలు బాగా నిద్రపోవడం చాలా ముఖ్యం. అలా చేయకపోవడం మీ ఆరోగ్యానికి ప్రమాదకరం.. అయితే.. నిద్రలో అకస్మాత్తుతగా లేవడం.. నిద్రలేమి.. గుండె ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మంచి ఆరోగ్యానికి తగినంత నిద్ర చాలా ముఖ్యం. కానీ రాత్రిపూట మీకు తరచుగా అంతరాయం కలిగిస్తుంటే, దానిని సాధారణ సమస్యగా తోసిపుచ్చకండి. నిద్రలో తరచూ మేల్కొనడం.. అంతరాయం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు.. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన కొత్త పరిశోధన ప్రకారం.. తరచుగా అంతరాయాలు గుండె ఆరోగ్యానికి తీవ్రమైన పరిణామాలను కలిగిస్తాయి. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, అది అనేక ప్రమాదకరమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. పరిశోధన ప్రకారం, ప్రతి ఒక్కరూ రాత్రికి కనీసం 7 నుండి 8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యం. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, తరచుగా నిద్రకు అంతరాయాన్ని ఎదుర్కొనే వ్యక్తులు అధిక రక్తపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది. నిద్రకు అంతరాయం కలిగించేవి శరీరం పూర్తిగా మరమ్మత్తు చేయకుండా నిరోధిస్తాయి.. ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. తరచుగా నిద్రకు అంతరాయం కలిగించేవి మెదడుపై కూడా ప్రభావం చూపుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. రాత్రిపూట గాఢ నిద్రలో అనేక అవయవాలు విశ్రాంతి పొందడంతోపాటు.. రిపేర్ అవుతుంటాయి. గుండె విశ్రాంతి తీసుకుంటుంది.. రక్తపోటు సాధారణంగా ఉంటుంది. కానీ నిద్రకు పదేపదే అంతరాయం కలిగితే, గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది వాపునకు కారణమవుతుంది. ఇంకా ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. రోజుకు 23 అంతరాయాలను నివేదించే వ్యక్తులకు గుండె జబ్బుల ప్రమాదం 30 శాతం పెరుగుతుంది. మానసిక ఒత్తిడి స్పష్టంగా గుండెను ప్రభావితం చేస్తుంది. అందువల్ల, మీరు తరచుగా రాత్రిపూట మేల్కొలుపులు ఎదుర్కొంటుంటే మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా కొంతమంది చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంకా తక్కువ నిద్రపోవడం వల్ల శరీరంలోని రక్త పోటు, గ్లూకోజ్ మెటబాలిజం, వాపు వంటి జీవ ప్రక్రియలకు భంగం కలుగుతుంది.

# ప్రోటీన్ లోపం షుగర్ వస్తుందంట..




మనం ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి సరైన పోషకాలు అవసరం. సమతుల్య ఆహారం తీసుకుంటేనే సరైన పోషకాలు లభిస్తాయి. శరీరంలో ఏ ఒక్క పోషకం తగ్గినా అనేక సమస్యలు వస్తాయి. అలాంటి పోషకాల్లో ఒకటి ప్రోటీన్. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ప్రోటీన్ మన శరీర నిర్మాణానికి అవసరమైన పదార్థం. కండరాల్ని నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి.. హార్మోన్లు, ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయడానికి, రోగనిరోధక శక్తిని బలంగా ఉంచడానికి ప్రోటీన్ చాలా అవసరం. అందుకే నిపుణులు ఎల్లప్పుడూ ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తారు. అయితే ప్రోటీన్ లోపం వల్ల శరీరంలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. శరీరంలోని కొన్ని సమస్యలు ప్రోటీన్ లోపాన్ని సూచిస్తాయని వివరిస్తూ డాక్టర్ సాకేత్ గోయల్ ఇన్స్టాగ్రామ్ వీడియోను పోస్ట్ చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. భారతదేశంలోని ప్రతి వ్యక్తికి వారి ఆహారంలో 30 నుంచి 50 శాతం ప్రోటీన్ లోపం ఉంది. ఇది పరిష్కరించడం చాలా ముఖ్యం. ప్రతి వ్యక్తి శరీర బరువులో కిలోగ్రాముకు ఒక గ్రాము ప్రోటీన్ అవసరం. దీని అర్థం ఎవరైనా 70 కిలోగ్రాముల బరువు ఉంటే, వారికి రోజుకు సుమారు 70 గ్రాముల ప్రోటీన్ అవసరం. అథ్లెట్లు, బాడీబిల్డర్లు లేదా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి, ఈ మొత్తం ఇంకా ఎక్కువగా ఉండవచ్చు. తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల బలహీనత, కండరాల నష్టం, రోగనిరోధక శక్తి తగ్గుతుంది. జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేసేవారికి ఎక్కువ ప్రోటీన్ అవసరం. ఇంకా, 50 ఏళ్లు పైబడిన వారు కూడా ప్రతిరోజూ శరీర బరువులో ప్రతి పౌండ్‌కి 1.2 నుంచి 1.5 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలని డాక్టర్ సాకేత్ గోయల్ వివరించారు. దీని అర్థం వారికి 90-100 గ్రాముల ప్రోటీన్ అవసరం. ఈ అవసరం తీర్చడం కష్టం. ఇది శరీరంలో ప్రోటీన్ లోపానికి దారితీస్తుంది. శరీరంలో ప్రోటీన్ లేకపోవడం వల్ల కండరాల బలహీనత ఏర్పడుతుంది. ఇది సార్కోపెనియాకు దారితీస్తుంది. ఇక్కడే వయస్సు పెరిగే కొద్దీ కండర ద్రవ్యరాశి తగ్గుతుంది. నిలబడే సామర్థ్యం తగ్గుతుంది. శరీర బలం తగ్గుతుంది. గాయాల ప్రమాదాన్ని పెంచుతుంది. ప్రోటీన్ లేకపోవడం వల్ల కండరాలు మాత్రమే కాకుండా ఎముకలు కూడా బలహీనపడతాయి. గాయాల సమయంలో ఎముకలు విరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ప్రోటీన్ లోపం వల్ల తరచుగా అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్లు వస్తాయి. శరీరం యొక్క రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే ఈ సమస్యలు వస్తాయి. శరీరం యొక్క రక్షణ విధానాలు మందగిస్తాయని డాక్టర్ చెబుతున్నారు.

# అల్లం, వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెడితే ఏమవుతుంది?



కూర ఏదైనా సరే.. దానికి మంచి రుచి రావాలంటే.. ఉప్పు, కారాలతో పాటుగా తాజా అల్లం, వెల్లుల్లి, మసాలా ఉండాల్సిందే.. ఇక్కడ తాజా అల్లం వెల్లుల్లి పాత్ర అతి ముఖ్యమైనది. కూరలకు ఇది అదిరిపోయే రుచిని ఇస్తుంది. అందుకే ప్రతి ఒక్కరి వంటింట్లో తప్పనిసరిగా అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎప్పుడూ నిల్వ ఉంటుంది. అయితే, దీన్ని నిల్వ చేసేందుకు చాలా మంది ఫ్రిజ్‌లో పెడుతుంటారు. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా..? లేదా అనే దానిపై జనాల్లో అనేక సందేహాలు ఉన్నాయి. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల అవి విషపూరితంగా మారతాయనే పుకార్లు కూడా ఉన్నాయి. అయితే, నిపుణుల ప్రకారం, వీటిని ఫ్రిజ్‌లో ఉంచడం తప్పనిసరి కాదని అంటున్నారు. రిఫ్రిజిరేటర్ లేని రోజుల్లో కూడా అల్లం, వెల్లుల్లి నెలల తరబడి తాజాగా ఉండేవని చెప్పారు. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలలో నీటి శాతం తక్కువగా ఉంటుంది. వైద్యపరంగా, వాటిని నీరు లేని కూరగాయలు అని పిలుస్తారు. ఫ్రిజ్‌లోని చలి, తేమ వాటిలోని తేమను ఆకర్షిస్తాయి. దీనివల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. తేమతో కూడిన వాతావరణంలో బాక్టీరియా, శిలీంధ్రాలు త్వరగా పెరుగుతాయి. అందుకే ఫ్రిజ్‌లో నిల్వ చేసిన వస్తువులు కొన్నిసార్లు త్వరగా చెడిపోతాయి. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలను బుట్టలో, మెష్ బాక్స్‌లో లేదా బహిరంగ ప్రదేశంలో నిల్వ చేయడం మంచిదని చెబుతున్నారు.. ఇది రుచి, నాణ్యతను కాపాడుతుంది. మీరు దానిని ఫ్రిజ్‌లో ఉంచితే అది విషపూరితం కాదు. కానీ మీరు దానిని తప్పుగా నిల్వ చేస్తే, అది త్వరగా చెడిపోతుంది. కాబట్టి, పొడి ప్రదేశం ఉత్తమం. పైగా ఫ్రిజ్‌లోని ఇతర పదార్థాలు కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది. మొత్తం మీద ఎప్పటికప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ ని తయారు చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే వంట రుచి కూడా సూపర్‌గా ఉంటుంది.

# ఫ్యాట్‌ని పెంచని ఫుడ్స్ కడుపు నిండా తిన్నా సన్నగానే ఉంటారు



ఆహారం తినకుండా బరువు తగ్గడం సరైంది కాదు. సగం కడుపు మాడ్చుకుని తినడం కూడా మంచిది కాదు. ఎందుకంటే, అలాంటి డైట్‌పై ఓసారి కాకపోయినా మరోసారి విరక్తి వచ్చేసి ఆ డైట్‌నే మార్చేస్తారు. మళ్ళీ మొదటికొస్తారు. అందుకే, మంచి డైట్‌ని ముందుగా సెలక్ట్ చేసుకోవాలి. ఆ డైట్ ప్రకారమే తింటే కడుపు నిండుగా ఉంటుంది. దీంతో ఫ్యాట్ లాస్ అవుతారు. వెయిట్‌లాస్ కూడా అవుతారు. కోడిగుడ్లు అందరికీ అందుబాటులో ఉండే బెస్ట్ ప్రోటీన్ సోర్స్. రోజూ వీటిని డైట్‌లో యాడ్ చేయడం వల్ల త్వరగా కడుపు నిండుతుంది. ఇందులో ప్రోటీన్‌తో పాటు ఫ్యాట్, ఇతర పోషకాలు కూడా ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి ఎంతో మంచివి. ఉడకబెట్టుకుని తింటే వెయిట్‌మేనేజ్‌మెంట్‌లో చక్కగా హెల్ప్ చేస్తాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కి పర్ఫెక్ట్ ఛాయిస్. అలానే పాప్‌కార్న్. ఇది కూడా మంచి ఫైబర్ ఫుడ్. వీటిని చాలా మంది టైంపాస్‌కి తింటుంటారు. కానీ, అలా కాకుండా, చక్కగా వీటిని కడుపుని నింపే ఫుడ్స్ అని చెప్పొచ్చు. చాలా టేస్టీగా ఉంటాయి. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ఫుడ్ కూడా కాదు. కాబట్టి, చక్కగా తినొచ్చు. రుచికి రుచి. బరువు కూడా తగ్గుతారు. పెసరపప్పు కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని తినడం వల్ల ఒంటికి చలువ. పైగా పప్పులో ఎన్నో పోషకాలు ఉంటాయి. ప్రోటీన్, లిపిడ్స్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, కాల్షియం, ఐరన్, సోడియంలు ఎక్కువగా ఉంటాయి. వీటిని మీరు ఎలా అయినా తీసుకోవచ్చు. అదే విధంగా మొక్కజొన్న. మొక్కజొన్నలో కూడా ప్రోటీన్, లిపిడ్ ఫ్యాట్, కార్బోహైడ్రేట్స్, ఎనర్జీ, పంచదార శాతం ఎక్కువగా ఉంటాయి. వీటిని చక్కగా ఉడికించి, వేయించి ఎలా అయినా తీసుకోవచ్చు. దోసకాయ, సొరకాయల్లో కూడా నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. కేలరీలు తక్కువగా, నీటిశాతం ఎక్కువగా ఉండే కూరగాయల్లో ఇవి ఒకటి. దోసకాయల్ని మనం సలాడ్స్, నేరుగానైనా తీసుకోవచ్చు. అదే విధంగా, సొరకాయని మీరు పప్పు, కూరలు, ఎలా అయినా వండుకుని తినొచ్చు. వీటి వల్ల పోషకాలు అందుతాయి. కడుపు నిండుతుంది. ఫ్యాట్‌లాస్ అవ్వడానికి ఎక్కువగా హెల్ప్ అవుతుంది. క్యాబేజీ, క్యారెట్స్‌లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల త్వరగా కడుపు నిండుతుంది. క్యాబేజీలో విటమిన్ కె, సి,ఫైబర్, ఫోలేట్, బి విటమిన్స్, మినరల్స్, పొటాషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఇవన్నీ కూడా మన జీర్ణశక్తి, ఇమ్యూనిటీని పెంచుతాయి. అంతేకాకుండా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీర కణాలను డ్యామేజ్ కాకుండా చేస్తాయి. ఫ్యాట్ పెరగకుండా చేస్తాయి. ఇక క్యారెట్స్‌లో బీటా కెరోటిన్, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవన్నీ కంటి ఆరోగ్యాన్ని, జీర్ణ ఆరోగ్యాన్ని, గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. వీటిలోని నీటిశాతం కడుపు నిండేలా చేస్తుంది. వీటిని హెల్దీ స్నాక్స్‌గా మనం కన్సిడర్ చేయొచ్చు. బొప్పాయి పండు కూడా ఎంతో టేస్టీగా ఉండే పండు. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. పైగా నీటిశాతం ఎక్కువగా ఉండి విటమిన్స్, ఫైబర్, పొటాషియం, ఫోలేట్, యాంటీ ఆక్సిడెంట్స్, లైకోపీన్‌లు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ, జీర్ణ శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. శనగలు కూడా మంచి గ్రెయిన్. ఇందులో ప్రోటీన్, ఫైబర్, కాంప్లెక్స్ కార్బ్స్, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉన్నాయి. వీటిని మనం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేయడమే కాకుండా, కండరాలకి కూడా మంచిది.

# ఉప ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లుకు అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుసభను సజావుగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలనిరాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.బుధవారం రోజున జరగనున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సభకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,జిల్లా పోలీస్ అధికారి అశోక్ లతో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపైసంబంధిత అధికారులతో పరిశీలించారు. సభా వేదిక, విద్యుత్,ఇతర ఏర్పాట్లుపటిష్ఠంగా చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, నీడ సదుపాయాలుతగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీసు అధికారులకు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపైప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలనిసంబంధిత శాఖలను ఆదేశించారు. సభను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలనిఅధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ప్రతిష్ఠకు తగిన విధంగాఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎమ్మార్వో, ఎంపిడివో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

**కరీంనగర్ :** ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. పోలీసు కవాతు మైదానంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్టేజీ, పార్కింగ్, విద్యుత్, అలంకరణ, సౌండ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఎక్కువ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 108, 102, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది పేర్లను పరిశీలించి నివేదికలు పంపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ కవాతు మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పోలీస్ బందోబస్తు తో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# ప్రశ్నిస్తే కేసులు పెడతారా : గులాబీ నేతల ఫైర్

**హైదరాబాద్ :** టాపింగ్ కేసులో హరీష్ రావుకు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం 'స్కీమ్ ల' (పథకాల) ప్రభుత్వంగా వెలిగిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'స్కామ్ ల' (కుంభకోణాల) ప్రభుత్వంగా మారిందని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వంపై పోరాడుతున్న హరీష్ రావును ఎదుర్కోలేక, భయంతోనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారురేవంత్ రెడ్డి గతాన్ని గుర్తు చేస్తూ, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన 'రైఫిల్ రెడ్డి' అని ఆయన ఎద్దేవా చేశారు. నాడు టీడీపీలో ఉండి తెలంగాణ సాధనను అడ్డుకున్న రేవంత్ రెడ్డి, నేడు ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడిన హరీష్ రావు వంటి ఉద్యమకారుడిని వేధించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని కుయుక్తులు పన్నినా రేవంత్ రెడ్డి అవినీతిపై హరీష్ రావు పోరాటం ఆగదని, తెలంగాణ సమాజం మొత్తం హరీష్ రావు వెంటే ఉందని మధుసూదనా చారి స్పష్టం చేశారు. ప్రభుత్వ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే రేవంత్ రెడ్డి అరాచకాలను నిలదీసే రోజు దగ్గరలోనే ఉందని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం 'దండుపాళ్యం ముఠా' పాలన సాగుతోందని, ఆ ముఠాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సుమారు 1600 కోట్ల రూపాయల విలువైన సింగరేణి బొగ్గు గనుల కాంట్రాక్ట్ అక్రమాలను హరీష్ రావు బయటపెట్టినందుకే, ఆయనకు సిట్ ద్వారా నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మంత్రులు అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని, వాటిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆయన మండిపడ్డారు.కాళేశ్వరం, విద్యుత్, రేస్ కార్ వంటి వివిధ కేసుల పేరుతో టీవీ సీరియల్ తరహాలో రోజుకో డ్రామా ఆడుతూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సివిల్ సప్లైస్ శాఖలో భారీ అవినీతి జరిగిందని, సమ్మక్క-సారక్క టెండర్ల విషయంలో మంత్రుల మధ్యే గొడవలు జరుగుతున్నాయని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. హ్యామ్రోడ్ల పేరుతో మరో పెద్ద కుంభకోణానికి తెరలేపారని, పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి తన బంధువులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కుంభకోణాలపై విచారణ జరిపేందుకు సిట్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.హరీష్ రావుకు గతంలోనే సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని, అయినా కావాలని నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని ప్రశాంత్ రెడ్డి అన్నారు. తామంతా కేసీఆర్ సైనికులమని, ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల కోసం జైలుకు వెళ్లిన చరిత్ర హరీష్ రావుదని, రాష్ట్రం మొత్తం ఆయన వెంటే ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజా క్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని ఆయన హెచ్చరించారు.తెలంగాణలో గత రెండేళ్లుగా పాలన సాగడం లేదని, కేవలం టీవీ సీరియళ్ల మాదిరిగా రోజుకో కొత్త కేసు పేరుతో 'డ్రామా' నడిపిస్తున్నారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టినందుకే, ప్రభుత్వం భయపడి ఆయనకు సిట్ నోటీసులు ఇచ్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు కేసులు, జైళ్లు కొత్త కాదని.. ఉద్యమ సమయంలో కేటీఆర్, హరీష్ రావు అనేకసార్లు జైలుకు వెళ్లారని, ఇప్పుడు ఈ బెదిరింపులకు ఎవరూ లొంగబోరని ఆయన స్పష్టం చేశారు.కెసిఆర్, కేటీఆర్ లేదా హరీష్ రావులను ఎంతగా వేధించాలని చూస్తే, తెలంగాణ సమాజం అంతకంటే ఉవ్వెత్తున ఎగసిపడుతుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరిగిన ఈ భారీ బొగ్గు కుంభకోణంపై పార్లమెంటులో కూడా గళమెత్తుతానని రవిచంద్ర తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను దారుణంగా మోసం చేసిందని, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపు నిలబడి అత్యధిక స్థానాల్లో గెలిపించారని గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే ఫలితం పునరావృతం అవుతుందనే భయంతోనే, విపక్ష నేతల అటెన్షన్ డైవర్ట్ చేయడానికి ఈ తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు.



### హరీష్ రావు ఆరడుగుల బుల్లెట్..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం హరీష్ రావుపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని బాలరాజు యాదవ్ విమర్శించారు. హరీష్ రావును ఆరడుగుల బుల్లెట్‌గా, నీతి నిజాయితీ గల "నిప్పు" వంటి నాయకుడిగా అభివర్ణిస్తూ, ఆయన ఎలాంటి తప్పు చేయకపోయినా కావాలనే కేసుల్లో ఇరికిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే దాడులకు దిగడం, తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమని ఆయన అన్నారు. గతంలో కాళేశ్వరం, ధరణి అని ఆరోపణలు చేసినా ఏమీ నిరూపించలేకపోయారని, సూర్యుడి మీద ఉమ్మి వేస్తే అది మీ మీదనే పడుతుందని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.రాష్ట్రంలోని మంత్రుల మధ్య అస్సలు సమన్వయం లేదని, కేవలం దోచుకున్న వాటాల పంచాయతీల కోసమే మంత్రుల మధ్య గొడవలు జరుగుతున్నాయని బాలరాజు యాదవ్ ఆరోపించారు. ముఖ్యంగా బొగ్గు టెండర్ల విషయంలో మంత్రుల మధ్య పెద్ద ఎత్తున వివాదం నడుస్తోందని, ఆ గొడవలను తట్టుకోలేకనే రేవంత్ రెడ్డి దావోస్‌కు పారిపోయారని ఎద్దేవా చేశారు. నిజంగా విచారణ జరపాలని ఉంటే, ముందుగా రేవంత్ రెడ్డి అల్లుడిపై సిట్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. హరీష్ రావుపై ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలోని మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లందరూ ఆయన వెంటే ఉంటారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అమాయక మహిళలే లక్ష్యంగా

## బంగారం దోచుకున్న అంతర్ జిల్లా ముఠా అరెస్ట్

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న ముగ్గురు పాత నేరస్తుల అంతర్ జిల్లా ముఠాను జిల్లా సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. గత కొన్ని రోజులుగా ధారూర్, వికారాబాద్ టౌన్, పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలను మోసం చేసి బంగారం దోచుకున్న వరుస ఘటనలు చోటుచేసుకోవడంతో, ఈ కేసులను ఎస్పీ సీరియస్గా తీసుకుని నిందితులను తక్షణమే పట్టుకోవాలని జిల్లా సిసిఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. సీసీటీవీ ఫుటేజీలు, టెక్నికల్ ఆధారాలు, నేరం జరిగిన తీరును లోతుగా విశ్లేషించి పక్కా సమాచారంతో ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వేముల లక్ష్మి. చెల్ల నర్సమ్మ, బండారి అనిత నిందితుల పై వికారాబాద్ జిల్లాతో పాటు నారాయణపేట జిల్లా మద్దూర్, కోస్గి, నరసన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోనూ కేసులు ఉన్నట్లు, అలాగే గతంలో సైబరాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, రాచకొండ, జగిత్యాల జిల్లాల్లో కలిపి సుమారు 28 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు

## స్వదేశీ సంకల్ప టూకే రన్




**కోరుట్ల :** పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు స్వదేశీ వస్తు వాడకం పై టూకే రన్ పరుగు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ స్వీతీ అనూప్ హాజరై మాట్లాడుతూ నేటి దేశ పరిస్థితులలో మనం అందరం స్వదేశీ వస్తు వాడకం పై అవగాహన కలిగి ఉండాలన్నారు.సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు ఈరోజు స్వదేశీ సంకల్ప టూకే రన్ పెరుగు నిర్వహించడం చాలా అభినందనీయం అన్నారు.మనందరం కూడా స్వదేశీ వస్తువులు వాడుతూ మన దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఆనంతరం పాఠశాల ప్రబంధ కారిణి అధ్యక్షులు డాక్టర్ వేముల రవి కిరణ్ మాట్లాడుతూ నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన దేశం నాలుగవ స్థానంలో నుండి మూడో స్థానానికి వెళ్లడానికి ఈ స్వదేశీ వస్తు వాడకం చాలా అవసరమని మనందరం కూడా స్వదేశీ వస్తువులనే ఎక్కువగా వాడాలని తద్వారా మన దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని చెప్పారు..అలాగే ఈ నెలలో వివేకానంద స్వామి జయంతి తోపాటు సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకొని ఈ స్వదేశీ సంకల్ప పరుగు నిర్వహించుకోవడం చాలా హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఒడ్నాల నరేష్, పాఠశాల ప్రబంధ కారిణి, కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్,కోశాధికారి నీలి శ్రీనివాస్, సమితి ఉపాధ్యక్షుడు కార్యదర్శులు వడ్లకొండ రాజ, గంగాధర్, చెట్పల్లి శంకర్,ప్రబంధ కారిణి సభ్యులు అందె శివ ప్రసాద్, ,కొత్త సందీప్,తాటికొండ విశాల్ సమితి సభ్యులు ముదిగొండ రాజేశం, భీమనాతి రాజా గంగారం, ,పిస్కా రమేష్,ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు గట్ల ప్రవీణ్, గట్ల శివకుమార్,న్యాయవాది బద్రి సృజన్,మార్గం నరేష్, వాసం పవన్, లింగ ఉదయ్ కుమార్,మానుక రజనీకాంత్,విద్యార్థులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి లో చైన్ స్నాచింగ్

### ఆగంతకుల కోసం ముమ్మరంగా పోలీసులు గాలింపు

**మెట్ పల్లి :** పట్టణంలో మంగళవారం ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రాంనగర్ కాలనీలోని చాకిరేవు వద్ద మధ్యాహ్నం బట్టలు ఉతుకుతున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు ఆగంతకులు లాక్కెళ్లారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ఆమె కుమారుడు అడ్డుకునే ప్రయత్నం చేయగా వృద్ధురాలైన తల్లి, కొడుకులపై దుండగులు ఒక్కసారిగా దాడి చేసి వృద్ధురాలు మెడలో నగలను బలవంతంగా లాక్కొని పరాయ్యారు. అగంతకుల దాడిలో వృద్ధురాలికి, ఆమె కొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. దింతో వారిని మెట్ పల్లిలోనీ ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు దుండగుల ఆచూకి కోసం విచారణ చేపట్టారు.కాగా గుర్తు తెలియని వ్యక్తుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు .జిల్లాలో ఎక్కడైన అనుమానస్పదంగా కనిపించే వారి పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరి పట్ల ఏమైనా అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన

## జిల్లా కలెక్టర్ బి సత్యం ప్రసాద్



**జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో జరగబోయే ఐదు( 5) మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్ల ను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన జగిత్యాల పట్టణంలోని ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కౌంటింగ్ హాళు ,,బ్యారికేడ్లు,భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల అమరిక, స్ట్రాంగ్ రూమ్‌లు, ప్రవేశ?నిష్క్రమణ మార్గాలను వివరంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ పరిశీలనలో జగిత్యాల అదనపు కలెక్టర్( స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్,, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# మధ్యతరగతికి బడ్జెట్ ధమాకా..
# రూ.15 లక్షల వరకు నో ట్యాక్స్!

### భారత వృద్ధి అంచనాలను పెంచిన మూడీస్




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.3 శాతం వృద్ధిని సాధిస్తుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. కంపెనీలు పెట్టుబడులు పెట్టడం దగ్గరి నుంచి ఎక్కువ మందికి ఉపాధి లభించడం, ఆదాయాలు పెరగడం, ప్రజలు ఖర్చు చేసే ధోరణి సానుకూలంగా ఉండటం, బీమా రక్షణకు డిమాండ్‌ను పెరగడం వంటి అంశాలు మొత్తం దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయని మూడీస్ అభిప్రాయపడింది. అంతేకాకుండా దేశంలో వేగంగా పెరుగుతున్న డిజిటల్ వినియోగం, ప్రభుత్వం చేపడుతున్న పన్ను, బీమా రంగ సంస్కరణలు దోహదపడుతున్నాయి. ఇదే సమయంలో భారత్‌కు ఎగుమతుల నుంచి మాత్రమే వృద్ధికి మద్దతు లభించడం లేదు, దేశీయ డిమాండ్ వృద్ధికి ప్రధాన కారణమని నివేదిక వెల్లడించింది. గతేడాదిలో 6.5 శాతం నుంచి ఈసారి 7.3 శాతం భారత వృద్ధి ఉంటుందని భావిస్తున్నాం. అధిక వృద్ధి కొనసాగడం వల్ల దేశంలో సగటు ఆదాయం పెరుగుతుంది.ఎక్కువ మంది ఆరోగ్యం, జీవితం, పొదుపు కోసం బీమా పాలసీలను కొనవచ్చని తెలిపింది. ఫలితంగా రానున్న రోజుల్లో దేశ బీమా రంగం ఎక్కువ ప్రయోజనం పొందనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఎనిమిది నెలలు మొత్తం బీమా ప్రీమియం ఆదాయం 17 శాతం పెరిగి రూ. 10.9 లక్షల కోట్లకు చేరింది. ఆరోగ్య బీమా ప్రీమియంలు 14 శాతం, కొత్త జీవిత బీమా వ్యాపారం 20 శాతం పెరగడమే ఇందుకు కారణం. దేశంలో బీమాకు డిమాండ్ పెరుగుతోంది. ప్రజలు ఆరోగ్యం, ఆర్థిక నష్టాల గురించి ఎక్కువ అవగాహన ఆశిస్తున్నారు. డిజిటలైజేషన్ బీమా కొనుగోలును సులభతరం, వేగవంతం చేసిందని నివేదిక పేర్కొంది.

### పీఎన్‌బీ లాభం రూ.5,100 కోట్లు




ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 2025-26 అక్టోబరు-డిసెంబరులో రూ.5,100 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభాన్ని ఆర్జించడం ఇదే తొలిసారి. 2024-25 ఇదే కాల లాభం రూ.4,508 కోట్లతో పోలిస్తే ఇది 13% అధికం. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,752 కోట్ల నుంచి రూ.37,253 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.31,340 కోట్ల నుంచి రూ.32,231 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం రూ.11,032 కోట్ల నుంచి 4.5% తగ్గి రూ.10,533 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ లాభం రూ.6,621 కోట్ల నుంచి రూ.7,481 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.09% నుంచి 3.19 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.41% నుంచి 0.32 శాతానికి మెరుగయ్యాయి. అయినా కేటాయింపులు రూ.318 కోట్ల నుంచి రూ.1,341 కోట్లకు పెరిగాయి. 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈసీఎల్ (ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్) నిబంధనలను చేరుకోవడానికి రూ.955 కోట్ల అదనపు కేటాయింపులు చేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర వెల్లడించారు. ఇకపై ప్రతి త్రైమాసికంలో రూ.5,000 కోట్ల నికర లాభం లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసిన ఒక పెద్ద ఖాతా నుంచి భారీ మొత్తం వసూలు కావడంతో రికవరీ రూ.823 కోట్ల నుంచి రూ.1,956 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. వొడాఫోన్ ఐడియాకు గతంలో మంజూరు చేసిన రూ.300 కోట్ల రుణం బకాయిలుగా ఉందని, ప్రస్తుతం ఆ సంస్థకు కొత్తగా రుణాలు మంజూరు చేయలేదని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.8-2.9 శాతంగా ఉంటుందని అంచనా వేశారు.



దేశంలోని కోట్ల మంది మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు, ముఖ్యంగా వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. రాబోయే బడ్జెట్ 2026-27లో కొత్త పన్ను విధానం కింద ఆదాయపు పన్ను రాయితీలను భారీగా పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 87ఏ కింద ఇచ్చే పన్ను రిబేటు పరిమితిని ప్రస్తుతం ఉన్న దానికంటే గణనీయంగా పెంచి దాదాపు రూ. 1.5 లక్షల వరకు చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం కొత్త పన్ను విధానంలో రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రిబేటు లభిస్తోంది (గతంలో ఇది రూ. 7 లక్షలుగా ఉండేది). అయితే, రాబోయే బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పరిమితిని మరింత విస్తరించాలని భావిస్తోంది. సెక్షన్ 87ఏ రిబేట్ కారణంగా రూ. 12 లక్షల ఆదాయం వరకు ఎలాంటి ట్యాక్స్ పడడం లేదు. అయితే సెక్షన్ 87ఏ రిబేటును పెంచడం ద్వారా, రూ. 15 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న ఉద్యోగులు కూడా ఎటువంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేని పరిస్థితి కల్పించనున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు కేవలం 87ఏ రిబేటు మాత్రమే కాకుండా, స్టాండర్డ్ డిడక్షన్ కూడా తోడవుతుంది. ఇప్పటికే ఈ పరిమితిని రూ. 75,000కు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 87ఏరిబేటు కూడా పెరిగితే రూ. 15 లక్షల ప్యాకేజీ ఉన్న సామాన్య ఉద్యోగి చేతికి పూర్తి జీతం అందే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రజల వద్ద ఖర్చు చేయడానికి ఎక్కువ నగదు మిగులుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోందట. పన్ను నిపుణులు, ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం.. ప్రభుత్వం పాత పన్ను విధానం కంటే కొత్త పన్ను విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెక్షన్ 87ఏ రిబేటు పెంపునకు బదులుగా పన్ను లెక్కలు చాలా సరళంగా మార్చవచ్చని అంచనా వేస్తున్నారు. గత ఏడాది బడ్జెట్‌లోనే సెక్షన్ 87ఏ రిబేట్ భారీగా పెంచారు. దీంతో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.12 లక్షలకు చేరింది. దీంతో ఈసారి ఈ పరిమితిని పెంచకపోవచ్చంటున్నారు. అయితే, కొత్త పన్ను విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేసి, ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేందుకు రిబేట్ పెంచే అవకాశం లేకపోలేదంటున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరట లభిస్తుంది. ప్రజల చేతుల్లో డబ్బు ఎక్కువగా ఉంటే, మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు పెరిగి డిమాండ్ పెరుగుతుంది. వచ్చే ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే ఈ బడ్జెట్ పై సామాన్యుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వం ఈ సెక్షన్ 87ఏ రిబేటును రూ. 1.5 లక్షలకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే, భారత పన్ను చరిత్రలో ఇది ఒక విప్లవాత్మక మార్పుగా నిలుస్తుంది. పన్నుల భారం తగ్గుతుందన్న వార్తతో దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, ప్రైవేటు రంగ కార్మికులు హర్షం వ్యక్తం చేయనున్నారు.

### ఆకాశాన్నంటిన పసిడి, వెండి ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా గరిష్ట స్థాయికి చేరుకోవడంతో కొనుగోలుదారులు విస్మయానికి గురవుతున్నారు. అంతర్జాతీయ పరిణామాలు మరియు దేశీయ డిమాండ్ పెరగడం వల్ల ఈ భారీ పెరుగుదల నమోదైనట్లు మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు ఈ ధరల పెంపు పెద్ద షాక్‌గా మారింది, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ మార్పులు ఇన్వెస్టర్లలో కూడా చర్చనీయాంశమయ్యాయి.వెండి ధరలు మునుపెన్నడూ లేని విధంగా భారీ జంప్‌ను నమోదు చేశాయి. ఒక్క రోజులోనే కేజీ వెండి ధరపై ఏకంగా రూ.12,000 అదనంగా పెరగడంతో, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,30,000 మార్కును తాకింది. సాధారణంగా వెండి ధరల్లో స్వల్ప మార్పులే కనిపిస్తుంటాయి, కానీ ఈ స్థాయి భారీ పెరుగుదల పరిశ్రమ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పారిశ్రామిక అవసరాలు మరియు వెండిపై పెట్టుబడులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.బంగారం ధరల విషయానికి వస్తే, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములకు రూ.1,040 పెరగడం తో ఇప్పుడు దీని ధర రూ.1,47,280 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా వాడే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.950 ఎగబాకి, రూ.1,35,000 మార్కుకు చేరుకుంది. పసిడి ప్రేమికులకు ఇది మింగుడుపడని వార్తే అయినప్పటికీ, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ధరలు ఎక్కడా తగ్గే సూచనలు కనిపించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. రవాణా ఖర్చులు మరియు స్థానిక పన్నుల కారణంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ధరలు కొద్దిపాటి వ్యత్యాసంతో కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల ఆధారంగా ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# చరిత్ర సృష్టించిన ఆర్సీబీ

## స్పోర్ట్స్



మహిళల ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ సరికొత్త చరిత్ర సృష్టించింది. లీగ్ చరిత్రలో వరుసగా ఆరు విజయాలు సాధించిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పింది. నిన్న (జనవరి 19) గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించిన ఈ జట్టు.. అంతకుముందు ఇదే ఎడిషన్‌లో (2026) ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్, ముంబై ఇండియన్స్‌పై వరుస విజయాలు సాధించింది. అంతకుముందు ఎడిషన్‌లో (2025) తమ చివరి మ్యాచ్‌లోనూ ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించిన ఆర్సీబీ.. డబ్ల్యూపీఎల్‌లో వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన తొలి జట్టుగా చరిత్రకెక్కింది. లీగ్ చరిత్రలో ఏ జట్టు వరుసగా ఇన్ని మ్యాచ్‌ల్లో విజయాలు సాధించలేదు. గతంలో ముంబై ఇండియన్స్ రెండు సార్లు వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించింది. ఆర్సీబీనే గతంలో ఓ సారి వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గెలుపొందింది.

**ప్లే ఆఫ్స్‌కు ఆర్సీబీ**

తాజాగా గుజరాత్ జెయింట్స్‌పై విజయంతో ఆర్సీబీ ఈ ఎడిషన్‌లో ప్లే ఆఫ్స్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. ప్లే ఆఫ్స్‌కు ముందు ఆ జట్టు ఇంకా మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. 24న ఢిల్లీతో, 26న ముంబై ఇండియన్స్‌తో, 29న యూపీతో తలపడాల్సి ఉంది. ఈ మూడు మ్యాచ్‌ల్లో ఓడినా ఆర్సీబీ ప్లే ఆఫ్స్‌లో ఉంటుంది. నిన్నటి మ్యాచ్‌లో ఆర్సీబీ అన్ని విభాగాల్లో సత్తా చాటి గుజరాత్‌ను 61 పరుగుల తేడాతో మట్టికరిపించింది. తొలుత బ్యాటింగ్ చేసి, అనామక ప్లేయర్ గౌతమి నాయక్ (55 బంతుల్లో 73; 7 ఫోర్లు, సిక్స్) చెలరేగడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. మంధన (26), రిచా ఘోష్ (27) ఓ మోస్తరు స్కోర్లతో రాణించగా.. ఆఖర్లో రాధా యాదవ్ (17), శ్రేయాంక పాటిల్ (8 నాటౌట్) బ్యాట్ ఝులిపించారు. గుజరాత్ బౌలర్లలో కశ్వీ గౌతమ్, ఆష్లే గార్డ్నర్ తలో 2, రేణుకా సింగ్, సోఫి డివైన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 179 పరుగుల లక్ష్య ఛేదనలో గుజరాత్ పూర్తిగా చేతులెత్తేసింది. సయాలి సత్ఘరే (4-0-21-3), డి క్లెర్క్ (4-0-17-2), లారెన్ బెల్ (4-1-23-1), రాధా యాదవ్ (4-0-34-1), శ్రేయాంక పాటిల్ (4-0-19-1) ధాటికి నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 117 పరుగులు మాత్రమే చేయగలిగింది. గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఆష్లే గార్డ్నర్ (54) ఒంటరిపోరాటం చేసినా, ప్రయోజనం లేకుండా పోయింది. అనుష్క శర్మ (18), భారతి ఫుల్మాలి (14), తనుజా కన్వర్ (11 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు.

### కెప్టెన్ ఫామ్ అందుకునేనా..
### తిలక్ వర్మ స్థానంలో ఆడేది ఎవరు?



స్వదేశంలో పొట్టి ప్రపంచకప్ ముందు భారత జట్టు చిట్టచివరి సిరీస్ ఆడనుంది. వరుసగా రెండోసారి విజేతగా నిలవాలనుకుంటున్న టీమిండియా అన్ని అస్త్రాలను సరి చూసుకోనుంది. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునేందుకు చాలా మంచి అవకాశం. అయితే.. ప్రతిభావంతులకు కొదవలేకున్నా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ గురించే అందరి ఆందోళనంతా. ఇటీవల వరుసగా తేలిపోతున్న మిస్టర్ 360 మెగా టోర్నీ ముందు టచ్‌లోకి వస్తాడా? తిలక్ వర్మ స్థానంలో ఎవరు ఆడుతారు? అనేది ఉత్కంఠ రేపుతోంది. పొట్టి క్రికెట్‌లో వరుస సిరీస్ విజయాలతో భారత జట్టు తిరుగులేని శక్తిగా అవతరించింది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా గడ్డపై, స్వదేశంలో దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించిన టీమిండియా ఈసారి న్యూజిలాండ్‌కు చెక్ పెట్టాలనుకుంటోంది. వన్డే సిరీస్‌లో సంచలన ఆటతో విజేతగా నిలిచిన బ్లాక్‌క్యాప్స్‌ను పొట్టి ఫార్మాట్‌లో చావుదెబ్బ కొట్టాలని సూర్యకుమార్ సేన పట్టుదలతో ఉంది. జనవరి 21న బుధవారం నాగ్‌పూర్‌లో టీ20 సిరీస్ షురూ కానుంది. స్క్వాడ్‌లో అభిషేక్ శర్మ సంజూ శాంసన్ హార్దిక్ పాండ్యా.. రింకూ సింగ్ వంటి బిగ్ హిట్టర్లు, మ్యాచ్ విన్నర్లు చాలామందే. కానీ, సారథి సూర్య ఆటపైనే సందేహాలున్నాయి. రెండేళ్లక్రితం టీ20 ప్రపంచకప్ తర్వాత నుంచి అతడి గణాంకాలు దారుణంగా పడిపోయాయి. 22 ఇన్నింగ్స్‌ల్లో 12.84 సగటుతో 244 రన్స్ చేశాడతే. శాంసన్ మూడు సెంచరీలతో.. తానెంత ప్రమాదకరమో ఇప్పటికే చాటుకున్నాడు.

**ఇషాన్‌కే ఛాన్స్?**

గాయంతో సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను ఆడిస్తారా? ఇషాన్ కిషన్‌ను తీసుకుంటారా? అనేది ఆసక్తి రేపుతోంది. మూడేళ్ల క్రితం డిసెంబర్‌లో చివరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడిన అయ్యర్‌కు ఐపీఎల్ ఫైనలే ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఆఖరిది. అదే ఇషాన్ కిషన్ విషయానికొస్తే.. ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లో జార్ఖండ్ సారథిగా ఇరగదీశాడు. సంచలన ఇన్నింగ్స్‌లతో జట్టును విజేతగా నిలిపిన ఈ చిచ్చరపిడుగు.. సెలెక్టర్ల దృష్టిలో పడి ప్రపంచకప్ బెర్తు సైతం దక్కించుకున్నాడు. కాబట్టి.. ఈ లెఫ్ట్‌హ్యాండర్‌కే తొలి టీ20లో అవకాశం దక్కుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### వెస్టిండీస్‌కు షాకిచ్చిన ఆఫ్ఘనిస్తాన్



ఇటీవలికాలంలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు వెస్టిండీస్‌కు వరుసగా షాకులిస్తుంది. తాజాగా అదే సీన్ రిపీటైంది.దుబాయ్ వేదికగా జరుగుతున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘన్ జట్టు విండీస్‌పై 38 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయినప్పటికీ.. ఆతర్వాత అనూహ్యంగా పుంజుకుంది. ఇబ్రహీం జద్రాన్ (56 బంతుల్లో 87 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), దర్విష్ రసూలీ (59 బంతుల్లో 84; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడి ఓ మోస్తరుకు మించి భారీ స్కోర్ అందించారు. వీరిద్దరూ చెలరేగడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో రహ్మానుల్లా గుర్బాజ్ డకౌట్ కాగా.. సెదిఖుల్లా అటల్ 2 పరుగులు మాత్రమే చేశాడు. విండీస్ బౌలర్లలో జేడన్ సీల్స్, మాథ్యూ ఫోర్డ్ తలో వికెట్ తీశారు. అనంతరం 182 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్ తడబడింది. జియా ఉర్ రెహ్మాన్ (4-0-36-3), రషీద్ ఖాన్ (4-0-19-2), ముజీబ్ ఉర్ రెహ్మాన్ (4-0-29-2), నూర్ అహ్మద్ (3-0-34-2) ధాటికి 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 143 పరుగులకే పరిమితమైంది. విండీస్ ఇన్నింగ్స్‌లో సాంప్సన్ (30) టాప్ స్కోరర్‌గా కాగా.. జాన్సన్ ఛార్లెస్ (27), మోటీ (28), ఫోర్డ్ (25) రెండంకెల స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లలో ఎవిన్ లూయిస్, బ్రాండన్ కింగ్ చెరో 4, జాంగూ, హెట్‌మైర్, పియెర్రీ తలో 3 పరుగులు చేసి ఔటయ్యారు. ఈ సిరీస్‌లోని రెండో టీ20 రేపు (జనవరి 21) ఇదే వేదికగా జరుగనుంది.



## ఓ వైపు వెడ్డింగ్ రూమర్స్.. మరోవైపు 'కొత్త ప్రారంభం' అంటున్న మృణాళ్ ఠాకూర్

తెలుగుతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది మృణాళ్ ఠాకూర్. ఈ మరాఠీ ముద్దుగుమ్మ లైనప్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలున్నాయి. కాగా ఈ బ్యూటీ ధనుష్‌తో క్లోజ్‌గా కనిపిస్తుందని.. ఇద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లిపీటలెక్కేందుకు రెడీ అవుతున్నారంటూ పుకార్లు షికారు చేశాయి. అయితే అలాంటిదేమీ లేదని అవన్నీ వట్టి పుకార్లేనని మృణాళ్ ఠాకూర్ సన్నిహితవర్గాలు వెల్లడించాయి.

ఇదిలా ఉంటే అందరి దృష్టిని ఈ టాపిక్ నుంచి మళ్లిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికర అప్‌డేట్ షేర్ చేసింది మృణాళ్ ఠాకూర్. కొత్త సంవత్సరం, కొత్త స్క్రిప్ట్, కొత్త ప్రారంభం.. అంటూ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చింది. తాను హైదరాబాద్‌లో ఉన్నానని చెబుతూ.. కొత్త తెలుగు సినిమా కోసం పనిచేస్తున్నట్టు హింట్ ఇచ్చింది. మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం అట్లీ-అల్లు అర్జున్ సినిమా ాూ22లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ గురించే హింట్ ఇచ్చిందంటూ నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే కొత్త ప్రాజెక్టు అనే సరికి మృణాళ్ ఠాకూర్ చేస్తున్న సినిమా ఇదేనా.. లేదంటూ పూర్తిగా కొత్త సినిమానా..? అంటూ డిస్కషన్స్ కూడా నడుస్తున్నాయి. ఈ భామ ఇంతకు ఏ సినిమా కోసం హైదరాబాద్‌కు వచ్చిందనేది సస్పెన్స్ నెలకొంది. కాగా మృణాళ్ ఠాకూర్, సిద్దార్థ్ చతుర్వేదితో కలిసి నటిస్తోన్న దో దివానే షెహర్ మే సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుంది. అడివిశేష్‌తో చేస్తున్న డెకాయిట్ మార్చి 19న విడుదల కానుంది.



## రెండోసారి తండ్రి కాబోతున్న డైరెక్టర్ అట్లీ

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ, ఆయన భార్య ప్రియ తాము రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. మా ఇంట్లోకి మరో చిన్నారి రాకతో మా సంతోషం రెట్టింపు కాబోతోంది. అవును, మేము రెండోసారి తల్లిదండ్రులం కాబోతున్నాం! మీ దీవెనలు ఎల్లప్పుడూ మాపై ఉండాలని కోరుకుంటున్నాం. ప్రేమతోడ అట్లీ, ప్రియ, మీర్, బెక్కీ, యుకీ, చోకీ, కాఫీ మరియు గూఫీ. అంటూ అట్లీ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. 2014లో వివాహం చేసుకున్న ఈ జంటకు ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత 2023 జనవరిలో మొదటి సంతానంగా కుమారుడు మీర్ జన్మించాడు. ఇప్పుడు రెండేళ్ల విరామం తర్వాత మళ్ళీ తల్లిదండ్రులం కాబోతున్నట్లు ప్రకటించారు.



## ప్రేమికుల దినోత్సవం కానుకగా 'నిలవే'

సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. పీఓవీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు మేకర్స్. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు ప్రకటించారు. బిగ్గెస్ట్ మ్యూజికల్ లవ్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం, భావోద్వేగాలతో పాటు కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందినట్టు చిత్ర బృందం వెల్లడించింది. ఈ చిత్రంలో సౌమిత్ పోలాడి, శ్రేయాసి సేన్ జంటగా నటించగా హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, రూపేష్ మారాపు, జీవన్ కుమార్, గురురాజ్, సిద్ధార్థ్ గొల్లపూడి, అనాల సుశ్మిత తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. విభిన్నమైన పాత్రలతో ప్రతి నటుడు తనదైన ముద్ర వేయనున్నారని దర్శక నిర్మాతలు తెలియజేశారు. ఈ సినిమాకు కళ్యాణ్ నాయక్ సంగీతం అందించగా, దిలీప్ కే కుమార్ సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

## ఈ విజయం మీకే అంకితం! 'మన శంకరవరప్రసాద్ గారు' సక్సెస్‌పై మెగాస్టార్ ఎమోషనల్ నోట్

మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటెస్ట్ సెన్సేషన్ "మన శంకరవరప్రసాద్ గారు" బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. ఈ సందర్భంగా చిత్రం సాధించిన అపూర్వ విజయంపై మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. మన శంకరవరప్రసాద్ గారు చిత్రంకి ప్రేక్షక దేవుళ్లు చూపిస్తున్న ఆదరణ మరియు అపూర్వమైన విజయాన్ని చూస్తుంటే నా మనసు కృతజ్ఞత భావనతో నిండిపోతోంది. నేను ఎప్పుడూ చెప్పేది నమ్మేది ఒక్కటే నా జీవితం మీ ప్రేమాభిమానాలతో ముడిపడింది. మీరు లేనిదే నేను లేను. ఈ రోజు మళ్లీ అదే నిజమని మీరు నిరూపించారు. ఈ విజయం పూర్తిగా నా ప్రియమైన తెలుగు ప్రేక్షకులది, నా ప్రాణసమానమైన అభిమానులది, నా డిస్ట్రిబ్యూటర్లది, సినిమాకు ప్రాణం పెట్టి పనిచేసిన ప్రతీ ఒక్కరిది మరియు ముఖ్యంగా దశాబ్దాలుగా నా వెంట నిలబడి ఉన్నవారందరిది. వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే నా శక్తి. రికార్డులు వస్తుంటాయి, పోతుంటాయి, కానీ మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం. ఈ బ్లాక్ బస్టర్ విజయం వెనుక ఎంతో కృషి చేసిన మా దర్శకుడు హిట్ మిషిన్ అనిల్ రావిపూడికి, నిర్మాతలు సాహు & సుస్మితలకు, అలాగే మొత్తం టీమ్ అందరికీ, నాపై మీరందరూ చూపిన అచంచలమైన నమ్మకానికి ధన్యవాదాలు.. ఈ సంబరాన్ని అలాగే కొనసాగిద్దాం. మీ అందరికీ ప్రేమతోడ లవ్ యూ ఆల్ మీ చిరంజీవి. అంటూ మెగాస్టార్ రాసుకోచ్చాడు.




## ఆ సినిమాల్లో నన్ను చూసి నాకే ఛీ అనిపించింది : శర్వానంద్

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్‌కి చాలా గ్యాప్ తర్వాత 'నారీ నారీ నడుమ మురారి'తో హిట్‌పడింది. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైన ఈ చిత్ర..తొలి రోజే పాజిటివ్ టాక్ సంపాదించుకుంది. పండక్కి ఎక్కువ సినిమాలు ఉండడంతో తొలి రోజు చాలా తక్కువ థియేటర్స్‌లో సినిమా రిలీజ్ అయింది. అయితే తొలి రోజే హిట్ టాక్ రావడంతో థియేటర్స్ సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతుంది. కలెక్షన్స్ కూడా భారీగా వస్తున్నాయి. చాలా రోజుల తర్వాత తన సినిమాకు హిట్ టాక్ రావడం ఆనందంగా ఉందంటున్నాడు శర్వానంద్. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తన పాత చిత్రాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కొన్ని సినిమాలు ఇప్పుడు చూసుకుంటే.. తనకే ఆసహ్యం కలుగుతుందని చెప్పారు. 'జాను(2019) సినిమా సమయంలో నాకు మేజర్ యాక్సిడెంట్ జరిగింది. నా చేయి కూడా పని చేయదని చెప్పారు. కానీ దేవుడి దయ, సంకల్ప బలంలో త్వరగానే రికవరీ అయ్యాను. అయితే ఆ సమయంలో నేను చాలా లావు అయిపోయాను. 'శ్రీకారం', 'ఆడవాళ్లు మీకు జోహార్లు' సినిమాల్లో చాలా లావుగా కనిపిస్తాను. కొన్నాళ్ల తర్వాత ఆ సినిమాలు చూస్తే.. 'ఛీ ఛీ..ఎలా ఉన్నా? నన్ను చూసి టికెట్స్ ఎందుకు తెగాలి?' అనిపించింది. అందుకే సినిమాల ఫెయిల్యూర్‌కి నేను కూడా ఒక కారణం అని భావించా. నన్ను నేను మార్చుకోవాలనుకున్నాను. ముందుగా నా శరీరాన్ని మునుపటి మాదిరిగా మార్చాలనుకున్నా. ముందుగా వాకింగ్ ప్రారంభించాను. ఆ తర్వాత రన్నింగ్, యోగా చేస్తూ డైటింగ్ చేశా.ఇప్పుడు నా లుక్ మారింది. నారీ నారీ నడుమ మురారి చిత్రంలో స్టైలీష్‌గా ఉన్నానని చెబుతున్నారు. బైకర్‌లో కూడా అలానే కనిపిస్తా.ఇకపై అన్ని మంచి సినిమాలు అందించడానికే కృషి చేస్తా' అని శర్వా చెప్పుకొచ్చాడు.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# జనవరి 24న ఛలో కోదాడకు బీఆర్ఎస్ పిలుపు

**వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయండి**
**మునగాల మండల అధ్యక్షుడు తొగరు రమేష్**

**ధర్మఘంట జనవరి 20 మునగాల**

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్ని శాఖల అధికారులను మరియు పోలీసులను ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలపై ఉసిగొలిపి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ప్రశ్నించిన పార్టీ నాయకులపైన దాడులు,దౌర్జన్యాలు చేస్తూ క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులను,కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,పార్టీ నాయకత్వంపై అక్రమంగా కేసులు నమోదు చేసి,బెదిరిస్తూ పోలీస్ లాఠీ రాజ్యాన్ని అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అధికార పార్టీ ఎమ్మెల్యే వ్యవస్థలను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జనవరి 24న ఛలో కోదాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు.ఈ కార్యక్రమానికి మునగాల మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు,



కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కోదాడ పట్టణంలోని దళిత యువకుడు కర్ల రాజేష్ పై కోదాడ రూరల్ సిఐ మరియు చిలుకూరు ఎస్ఐ పథకం ప్రకారం అక్రమంగా కేసులు నమోదు చేసి,కావాలనే రాజేష్ ని చిత్రహింసలకు గురిచేసి అనారోగ్యం పాలై మరణించడానికి కారణమయ్యారని ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురి చేస్తూ,అధికార పార్టీ నాయకుల దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయని,గత నెలలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో వివిధ గ్రామాల్లో తమ పార్టీ నాయకత్వంపై నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన దాడులు,దౌర్జన్యాల ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మునగాల మండలంలో నారాయణగూడెం దళితులపై మరియు తిమ్మారెడ్డిగూడెం, మాధవరం గ్రామాలలో జరిగిన దాడుల పరంపర నేటికీ కొనసాగుతుందని,ఈ దాడులను ఖండిస్తూ ఛలో కోదాడ కార్యక్రమానికి తమ పార్టీ పిలుపునిచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఛలో కోదాడ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి,అధికార కాంగ్రెస్ పార్టీ ఆగడాలపై నిరసన వ్యక్తం చేయాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు,వివిధ రాజకీయ పార్టీలు నాయకులు, ప్రజాస్వామ్యవాదులు ముక్త కంఠంతో ఖండించాలని కోరారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భూమి పూజ

**ధర్మఘంట జనవరి 20 కరీంనగర్:** కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి చేయటలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం నగరంలోని 51వ, డివిజన్లో రరూ.15 లక్షల సాధారణ నిధులతో రామాలయం నుండి వావిలాలపల్లి చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు.రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు డివిజన్ మాజీ కార్పొరేటర్ మేచినేని అశోక్ రావుతో పాటు డివిజన్ వాసులు ఘనస్వాగతం పలికి,పుష్ప గుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు.అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో సీఎం అస్యూరెన్స్ నిధులతో కరీంనగర్ నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని,ప్రత్యేకంగా కరీంనగర్ కు ఇచ్చిన స్మార్ట్ సిటీ ద్వారా మరింతగా అభివృద్ధి చేశామని, అప్పుడు చేసిన అభివృద్ధి తప్ప ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్లుగా ఒక్క పైసా కూడా కరీంనగర్ నగరానికి తీసుకురాలేదని విమర్శించారు.తమ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన సీఎం అస్యూరెన్స్ నిధులతో అభివృద్ధి చేయాల్సిందిగా సూచించారు.గతంలో ఈ రోడ్డును కొంతమంది అడ్డుకున్నారని,తద్వారా రోడ్డు నిర్మాణం జరగలేదన్నారు.కానీ, ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లా కలెక్టర్ ను కలిసి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకొని ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు



తెలిపారు. వారం రోజుల్లో నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రానున్నదని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని,రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి చేసేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. రాబోవు నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ మాజి కార్పొరేటర్ మేచినేని అశోక్ రావు,మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావు,మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్,డివిజన్ నాయకులు మల్లారెడ్డి,శేఖర్, చందు,బండారు ఆంజనేయులు, మధుకర్ పటేల్,దేవేందర్, ఆనందరావు,అంజన్ రావు, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి,మిడిదొడ్డి నవీన్,కిరణ్,పవన్,రాజు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు,డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# పల్లెల్లో మహమ్మారిగా మారిన నాటు సారా

**ఊరూరా ఏరులై పారుతున్న గుడుంబా**

**అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం**

**ప్రాణాలతో చెలగాటమాడుతున్న బెల్ట్ షాప్ యాజమాన్యం**

**వైన్ షాపుల సమయపాలన మార్చి విజృంభించిన బెల్ట్ షాపులు**

**ధర్మఘంట జనవరి 20 నాంపల్లి:** నల్గొండ జిల్లా నాంపల్లి మండలంలో గుడుంబా (నాటుసారా) మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది.ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా,పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా కొన్ని ప్రాంతాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు మూడు ప్యాకెట్ల ఆరు సీసాలుగా సాగుతున్నాయి.తక్కువ ధరకే మత్తు లభిస్తుండటంతో కూలీలు,సామాన్య ప్రజలు దీనికి బానిసలై తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు.నిర్లక్ష్యపు నీడలో ఎక్సైజ్ శాఖగ్రామాల్లో బెల్ట్ షాపులు,రహస్య స్థావరాల్లో గుడుంబా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా రోడ్లపై ఇండ్లలోనె ధైర్యంగా అమ్ముతున్నా ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.అక్కడక్కడా నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప,ఈ అక్రమ వ్యాపారానికి మూలకారకులైన 'పెద్ద తలకాయల'ను పట్టుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుడుంబా తయారీలో



మిథనాల్, యూరియా వంటి ప్రమాదకర రసాయనాలను వాడుతున్నట్లు సమాచారం.దీనితో కాలేయ వ్యాధులు,కంటిచూపు మందగించడం,నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి సమస్యలతో ఎంతో మంది మంచాన పడుతున్నారు.ఇంటి పెద్ద మనిషి వ్యసనానికి బానిసై అకాల మరణం చెందడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.మహిళలు, పిల్లలు దిక్కులేని వారవుతున్నారు.అధికారులు కేవలం కాగితాల మీద లెక్కలు చూపించడం మానేసి, క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని,గుడుంబా స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేయాలని,మత్తులో చితికిపోతున్న కుటుంబాలను చైతన్యం చేయాలని,నిరుపేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

## నిరుపేదకు అంత్యక్రియలు నిర్వహించిన కోక బిఆర్ ఫౌండేషన్

**ధర్మఘంట జనవరి 20 మోత్కూరు:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన నిరుపేద సిరిపురం ఉమేష్ (40) మంగళవారం మృతి చెందాడు. కనీసం దహన సంస్కారాలు చేసే పరిస్థితి లేకపోవడంతో విషయం తెలుసుకున్న కోక బి.ఆర్.ఫౌండేషన్ ముందుకు వచ్చి అంత్యక్రియల బాధ్యతలను స్వీకరించింది. ఉమేష్ మృతదేహానికి ఫౌండేషన్ చైర్మన్ కోక భిక్షం పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉమేష్



కుటుంబానికి అవసరమైన అన్ని అంత్యక్రియల ఖర్చులను ఫౌండేషన్ భరిస్తుందని తెలిపారు.సామాజిక సేవలో భాగంగా ఇలాంటి బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద మేతరి కురిమేటి యాదయ్య,చిరుమర్తి యాదయ్య,కురిమేటి నరేందర్, సూరారం యాదయ్య,కురిమేటి అను,కురిమేటి సాయి,కురిమేటి సుమన్,బూడిద ప్రవీణ్,డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి పట్టణంలో పట్ట పగలే దొంగల హల్ చల్

**ధర్మఘంట జనవరి20 మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో పట్ట పగలే దొంగలు హల్ చల్ చేశారు.పట్టణంలోని రాంనగర్ లో గల ధోభి ఘాట్ వద్ద బట్టలు ఉతుకుతున్న వృద్ధురాలు,ఆమె కొడుకుపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లి సంఘటన మెట్ పల్లి లో సంచలనం



రేపింది. ఈ ఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలవగా స్థానికులు ఆమెను ఓ ఆసుపత్రికి తరలించగా,ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలించి,కేసు నమోదు చేసుకుని,దొంగల కోసం ముమ్మర చర్యలు చేపట్టారు. ఎటువంటి ప్రాణప్రాయం జరగక పోవడంతో పోలీసులు, స్టానికులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటన పట్టణంలో ప్రజలను భయాందోళనకు గురి చేసింది. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం డబ్ల్యూజేఐ నిరంతర పోరాటం



**ధర్మఘంట జనవరి 20 కరీంనగర్:** రాష్ట్రంలోని గ్రామీణ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజేఐ) పనిచేస్తున్నదని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్,కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం, రామగుండం మండలాల ప్రెస్ క్లబ్ సభ్యులు మంగళవారం కరీంనగర్ లో డబ్ల్యూజేఐ నేతలను కలిసి,ఇప్పటివరకు కొనసాగుతున్న తమ ప్రెస్ క్లబ్ లను డబ్ల్యూజేఐ అనుబంధంగా నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. డబ్ల్యూజేఐ నాయకులు వారి వినతిని అంగీకరించారు.ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. సమాజాన్ని చైతన్య పరచడంలో జర్నలిస్టులు,విద్యావేత్తల పాత్ర కీలకమన్నారు.డబ్ల్యూజేఐ కృషి వల్ల ప్రింట్ మీడియాతోపాటు టెలివిజన్,రేడియో, డిజిటల్ మీడియాల్లో పనిచేసే జర్నలిస్టులు వర్కింగ్ జర్నలిస్టుల చట్టం,కార్మిక భద్రతా పరిధిలోకి వచ్చారన్నారు.తమ యూనియన్ దీర్ఘకాలిక పోరాటం వల్లనే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని,దీనివల్ల ప్రింట్ జర్నలిస్టులతో సమానంగా డిజిటల్ మీడియా,టెలివిజన్, రేడియో జర్నలిస్టులూ అనేక ప్రయోజనాలు పొందనున్నట్లు తెలిపారు.జర్నలిస్టుల్లో ఐక్యత లోపించడం వల్లనే సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. డబ్ల్యూజేఐ నాయకులను కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు పంజాల రాధాస్వామి గౌడ్,ప్రధానకార్యదర్శి సందూరి చంద్రమౌళి,సంయుక్త కార్యదర్శి కాంపెల్లి మల్లిఖార్జున స్వామి, కోశాధికారి నగునూరి రాజయ్య గౌడ్ లు ఉన్నారు.

## పాలకుర్తి గ్రామం పేరుతో సూచన బోర్డు ఏర్పాటు




**ధర్మఘంట జనవరి 20 రామగుండం:** రామగుండం నియోజకవర్గం పరిధిలోని పాలకుర్తి మండలంలో మంగళవారం గ్రామం పేరుతో ఏర్పాటు చేసిన సూచన బోర్డును రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ హాజరయ్యి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ...గ్రామాల గుర్తింపుకు,ప్రజలకు మార్గనిర్దేశానికి సూచన బోర్డులు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చలో కోదాడ బహిరంగ సభను విజయవంతం చేయాలి.

**బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నల్ల గోపాల్ రెడ్డి**

**ధర్మ ఘంట, జనవరి 20,అనంతగిరి :** పోలీసుల లాకప్ డెత్ లో చనిపోయిన కర్ల రాజేష్ మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోదాడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ ఆద్వర్యంలో ఈనెల 24న చేపట్టే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి ఓ ప్రకటన ద్వారా కోరారు.కొందరు అధికారులు,ప్రజాప్రతినిధులు నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.కర్ల రాజేశ్ మృతికి కారకులైన పోలీసులపై సరైన చర్యలు తీసుకోలేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే రాజేష్ మృతికి కారణమని,రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.చలో కోదాడ సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ధర్మఘంట

# అన్నం పరబ్రహ్మస్వరూపం

### శ్రీ అభయాంజనేయ స్వామి వారి సన్నిధిలో అన్నదానం



**ధర్మ ఘంట జనవరి 20 కోదాడ:-**

కోదాడ పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి సన్నిధిలో మంగళవారం 181 వ అన్నప్రసాద వితరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి దాతలుగా బత్తినేని లక్ష్మీ విజయరావు వంగవీటి కృష్ణయ్య రామకృష్ణ ఉషారాణి కాటేపల్లి శ్రీను రమాదేవి నాగరాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా సుమారు 400 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జూకూరి అంజయ్య,అన్నదాన నిర్వాహకులు డి. హనుమంతరావు,మోహనరావు వి.కృష్ణమూర్తి,సెక్రటరీ తిరుపతయ్య, కే.రవికుమార్, అనూష అన్వేష్ కన్యాకుమారి శిరీష,బ్రహ్మాజీ బ్యాటరీచారి, ఉమామహేశ్వరరావు,పెద్ది శేషు,ఆకుల పుల్లారావు,బి. సత్యం,మట్టయ్య, వి. రామారావు,డాక్టర్ రేపాల బ్రహ్మాజీ శ్రీకాంత్,పవన్, సతీష్,రంగా.శ్రీను,లక్ష్మారెడ్డి వి.రాంప్రసాద్, బుస్సా.అనిల్, వెంకటకృష్ణ విశాల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ




**ధర్మ ఘంట, జనవరి 20 మోత్కూరు:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే 10/10 జీపీఏ సాధించడం కష్టమేమీ కాదని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీ నరసింహారెడ్డి అన్నారు.మంగళవారం మోత్కూరు మండలంలోని బుజిలాపుర గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ యాదాద్రి భువనగిరి, మోత్కూర్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సురోజు భాస్కరాచారి యాదలక్ష్మి దంపతుల కుమారుడు సురోజు రవికుమార్ జ్ఞాపకార్థంగా గత 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇన్చార్జి ఎంఈఓ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ లక్ష్మి నరసింహారెడ్డి మాట్లాడుతూ, విద్యను ప్రేమగా స్వీకరించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్పర్సన్ విజయలక్ష్మి, రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు గుండగోని రామచంద్రం, రెడ్ క్రాస్ డైరెక్టర్ మరియు మాజీ సర్పంచ్ చేతరాశి అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, టి.రవి, బి.కరుణాకర్, వెంకటేశం, ఏ.భవాని, జి.వెంకటేశ్వర్లు, కే.మహేష్, ఏ.ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన కల్పన కుటుంబానికి ప్రభుత్వం పది లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి

### టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ సోమయ్య




**ధర్మ ఘంట జనవరి 20,సూర్యాపేట టౌన్ :** ఇటీవల అర్వపల్లి మండల కేంద్రంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన తుంగతుర్తి స్పెషల్ ఆఫీసర్ మామిడాల కల్పన కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్లో టీఎస్ యుటిఎఫ్ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు తో కలిసి మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయులు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా అతి తక్కువ వేతనాలతో కేజీబీవీ పాఠశాలల్లోని బాలికలకు ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన చేస్తున్నారని తెలియజేశారు. వారికి ఎలాంటి సెలవులు గాని, ఆర్థిక భద్రత లేదని తెలిపారు .ఇప్పటికైనా ప్రభుత్వం కేజీబీవీలలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్టు సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ మినిమం బేసిక్ పే అమలు చేయాలని మరియు ఎవరైనా సిబ్బంది మరణించినట్లయితే 10 లక్షల ఎక్స్గ్రేషియా తమ కుటుంబానికి చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.  ఈ నిరసన ప్రదర్శనలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే అరుణ భారతి, జిల్లా కోశాధికారి జి వెంకటయ్య జిల్లా కార్యదర్శిలు వెలుగు రమేష్ బి ఆడం సిహెచ్ రమేష్ డి లాలు డి శ్రీనివాస చారి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్ డి నారాయణమ్మ ఆసియా జబీన్ సరస్వతి నాగరాణి మాధవి ప్రసన్న శైలజ తేజశ్రీ హరిత నాగలక్ష్మి కేజీబీవీ ఉపాధ్యాయులు టి ఎస్ యుటిఎఫ్ వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం

**రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణ సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి**

**వాహనాలపై నిలబడి ప్రయాణం చేయడం ప్రమాదం.. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు,వ్యాపారులు ముందుకు రావాలి**

**సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ**







**ధర్మఘంట జనవరి 20 సూర్యాపేట:** జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించి, గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను జిల్లా ఎస్పీ కె.నరసింహ సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు,సలహాలు అందించారు.నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలని,ఫిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేసుకోవాలని, రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలని,కేసులు పెండింగ్ లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలని,కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలని,పోక్సో,మహిళా సంబంధ కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి,కోర్టులతో సమన్వయంగా పని చేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు.పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా పని చేయాలని,పోలీసు వేగవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని,కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పని చేయాలని దిశానిర్దేశం చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులను,ప్రజలను రోడ్డు భద్రత పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు.నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించాలన్నారు.రోడ్డు భద్రత పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి అరైవ్-అలైవ్ కార్యక్రమం ద్వారా ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రయాణ సమయంలో ప్రజలు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు,ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు.వాహనాలపై నిలబడి ప్రయాణం,ఎక్కువ మంది ప్రయాణం చేయడం ప్రమాదమని గుర్తు చేశారు. తప్పుడు మార్గంలో ప్రయాణం చేయొద్దు,మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, అసాంఘిక కార్యకలాపాలకు అక్రమ రవాణాలకు పాల్పడితే అలాంటి వారిని ఉపేక్షించమని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి,సూర్యాపేట డిఎస్పీ ప్రసన్నకుమార్,డిసిఆర్బి డిఎస్పీ రవి,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరిబాబు,ఇన్స్పెక్టర్లు నాగేశ్వరరావు,రాజశేఖర్, వెంకటయ్య,ఎస్ఐలు,ఐటి కోర్ సిబ్బంది,డిసిఆర్బి సిబ్బంది పాల్గొన్నారు.

# మీషో ఆప్ లో ఘరనా మోసం

**800పెట్టి రోడ్ స్కూటర్ ఆర్డర్ ఇస్తే 200 విలువగల షూ స్టాండు డెలివరీ**

**నిలదీస్తే డెలివరీ బాయ్ దురుసు ప్రవర్తన!**




**నాంపల్లి:ధర్మ ఘంట: (జనవరి 20)** నల్గొండ జిల్లా నాంపల్లి మండలం లో గాలెంక లింగస్వామి అనే యువకుడు ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్ 'మీషో' (వీవవంస్త్రశీ) లో మరోసారి వినియోగదారుడు మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక తండ్రి తన కుమారుడి కోసం ఎంతో ఆశతో 800 పెట్టి రోడ్ స్కూటర్ ఆర్డర్ చేయగా, తీరా పార్శిల్ విప్పి చూస్తే అందులో తక్కువ ధర గల 200 రూపాయలు విలువగల 'షూ స్టాండ్' కనిపించడంతో బాధితుడు ఒక్కసారిగా అవాక్కయ్యారు.వివరాల్లోకి వెళ్తే తన కుమారుడికి బహుమతిగా ఇవ్వడం కోసం ఒక తండ్రి మీషో యాప్ ద్వారా రోడ్ స్కూటర్‌ను ఆర్డర్ చేశారు. నిర్ణీత సమయానికి డెలివరీ బాయ్ వచ్చి పార్శిల్ ఇచ్చి వెళ్ళాడు. అయితే, బాక్స్‌ను తెరిచి చూసిన బాధితుడు లోపల ఉన్న వస్తువును చూసి షాక్‌కు గురయ్యారు. స్కూటర్‌కు బదులుగా ప్లాస్టిక్ షూ స్టాండ్ ముక్కలు అందులో ఉన్నాయి. దీంతో వెంటనే సదరు డెలివరీ బాయ్‌ను సంప్రదించి, "తప్పుడు వస్తువు వచ్చింది, దీనిని తిరిగి తీసుకువెళ్లి మాకు రావాల్సిన ప్రొడక్ట్ ఇవ్వండి" అని బాధితుడు కోరారు. అయితే, రిటర్న్ పెట్టి పది రోజులు గడుస్తున్న ఆ డెలివరీ బాయ్ కనీస బాధ్యత లేకుండా దురుసుగా సమాధానం ఇచ్చాడు. "నేను తీసుకువెళ్లేది లేదు.. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడటంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు మీషో వంటి యాప్‌లలో ఇలాంటి తప్పుడు వస్తువులు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా సబ్బు బిళ్ళలు, ఇటుకలు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయితే, డెలివరీ ఏజెంట్లు కూడా వినియోగదారులతో ఇలా దురుసుగా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కష్టపడి సంపాదించిన డబ్బుతో పిల్లల కోసం 800 పెట్టి కొంటే, ఇలా మోసం చేయడం ఏంటి? పంపిన వస్తువు తప్పు అని చెబితే కనీస మర్యాద లేకుండా మాట్లాడటం దారుణం. కంపెనీ వెంటనే స్పందించి న్యాయం చేయాలి" అని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు. ఆన్‌లైన్ లో వస్తువులు ఆర్డర్ చేసేవారు పార్శిల్ ఓపెన్ చేసేటప్పుడు తప్పనిసరిగా వీడియో తీయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# జనవరి 24 న ఛలో కోదాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## బి ఆర్ ఎస్ కోదాడ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు

**కర్ల రాజేష్ మృతి పోలీసు దౌర్జన్యానికి ప్రత్యక్ష నిదర్శనం...**

**చిలుకూరు ఎస్సైతో పాటు సంబంధిత అధికారులపై తక్షణ క్రిమినల్ చర్యలు చేపట్టాలి...**



**ధర్మ ఘంట,జనవరి 20, కోదాడ రూరల్:-** చలో కోదాడ కార్యక్రమంలో ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ బిఆర్ఎస్ కోదాడ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు తెలిపారు.  కర్ల రాజేష్ మృతికి కారకులైన చిలుకూరు ఎస్సైతో పాటు సంబంధిత పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీసుల దౌర్జన్యానికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ అరాచక పాలనను ఖండిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్న పోలీసుల వైఖరికి నిరసనగా బొల్లం మల్లయ్య యాదవ్ నేతృత్వంలో చలో కోదాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బిఆర్ఎస్ కోదాడ  మండల పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు కస్టడీలో కర్ల రాజేష్ అనుమానాస్పద మృతి చెందడం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచిన ఘటన. ఈ ఘటనపై ప్రభుత్వం మౌనం పాటించడం, బాధ్యులైన అధికారులను రక్షించే ప్రయత్నాలు చేయడం అత్యంత ఖండనీయమైనవి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ, ప్రజలపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయించడం నిత్యకృత్యంగా మారింది.బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదు.పోలీసు దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజల ఐక్య పోరాటమే పరిష్కారం.ఈ అన్యాయానికి వ్యతిరేకంగా,ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నేతృత్వంలో చలో కోదాడ కార్యక్రమం చేపట్టబడింది.ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాసంఘాలు, యువజనులు, మహిళలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు ముత్తవరపు రమేష్,పొట్టా విజయ కిరణ్,గుడిపూడి శ్రీకాంత్,బట్టు కోటేశ్వరరావు,షేక్ అబ్దుల్ నభీ,యరమాల శ్రీను,పోట్ల సతీష్, నల్లపాటిశ్రీనివాసరావు, పర్స హరి,పోతుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# పుర రాజకీయ రంగస్థలం ఎలా మారబోతుంది?

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరగనున్నాయి.రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసి) ఈ నెల 24 లేదా 27న నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని సమాచారం.ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికలు జరిగే అంచనాలు ఉన్నాయి.ఈ ఎన్నికలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి పెద్ద పరీక్షగా మారనున్నాయి.అలాగే ఇతర పార్టీలకు తమ బలాన్ని పునరుద్ధరించుకునే అవకాశంగా మారబోతున్నాయి.



ఎన్నికల నేపథ్యం మరియు మార్పులు

తెలంగాణలో 121 మున్సిపాలిటీలు మరియు 10 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ను మూడు భాగాలుగా విభజించి హైదరాబాద్,సైబరాబాద్,మల్కాజ్‌గిరి కార్పొరేషన్లుగా మార్చనున్నారు.ప్రతి కార్పొరేషన్‌కు సొంత మేయర్ మరియు కమిషనర్ ఉంటారు. ఈ విభజనతో హైదరాబాద్ రాజకీయ భూమికలో పెద్ద మార్పులు రానున్నాయి. రిజర్వేషన్లు కూడా ఇటీవల ఖరారు చేశారు.మేయర్ మరియు చైర్‌పర్సన్ పదవుల్లో జిహెచ్ఎంసి సహా ఖమ్మం, నిజామాబాద్,నల్గొండ వంటి ప్రధాన కార్పొరేషన్లు మహిళలకు రిజర్వ్ చేశారు.మహిళలకు, ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు కూడా తగిన రిజర్వేషన్లు కేటాయించారు.ఇది పార్టీలు అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

రాజకీయ పార్టీల వ్యూహాలు

కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత,సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఈ మున్సిపల్ ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని పటిష్టం చేసుకోవాలని చూస్తోంది. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన సంక్షేమ పథకాలు, ముఖ్యంగా మహిళలకు సంబంధించిన పథకాలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.జిహెచ్ఎంసి విభజనతో హైదరాబాద్ లోని అర్బన్ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది.అయితే, ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శలు,ముఖ్యంగా అభివృద్ధి ఆలస్యాలు ప్రభావం చూపవచ్చు.భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం కనిపిస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీలో అంతర్గత సమస్యలు ఉన్నప్పటికీ,గ్రామీణ మరియు సెమీ-అర్బన్ ప్రాంతాల్లో పార్టీకి ఇంకా మంచి బలం ఉంది.ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కొంతమేరకు విజయాలను సొంతం చేసుకుంది. మున్సిపాలిటీల్లో తమ పాత ఆధిపత్యాన్ని తిరిగి సాధించేందుకు ఈ ఎన్నికలను అవకాశంగా భావిస్తోంది.అయితే జిహెచ్ఎంసిలో పట్టు సాధించాలంటే ముస్లిం ఓట్లు మరియు ఏఐఎంఐఎంతో సంబంధాలు కీలకంగా మారనున్నాయి.ఇక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేంద్రంలో అధికారంలో ఉండి, జాతీయ స్థాయిలో బలంగా ఉన్నా,తెలంగాణలో అంతగా ప్రభావం చూపలేకపోతుంది. మొదటి నుండి అర్బన్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుంటుంది. ఇప్పుడు జిహెచ్ఎంసి విభజనతో సైబరాబాద్ వంటి టెక్ హబ్ ప్రాంతాల్లో బీజేపీ తమ ప్రభావాన్ని పెంచుకోవచ్చు.గత జిహెచ్ఎంసి ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించింది.బీజేపీ ప్రధానగా హిందుత్వ ఎజెండా మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమాలను ప్రచారంతో ముందుకెళ్లే ఛాన్స్ ఉంది. అయితే,గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లో బీజేపీ ఇంకా బలహీనంగానే ఉందనే చెప్పాలి. ముఖ్యంగా జిహెచ్ఎంసి పరిధిలో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) బలమైన పునాదులు కలిగి ఉంది.అక్కడ బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపి ప్రత్యర్థులను ఆహ్వానిస్తోంది. ముస్లిం మెజారిటీ వార్డుల్లో ఏఐఎంఐఎం ఆధిపత్యం కొనసాగించవచ్చు.జిహెచ్ఎంసి విభజనతో ఆ పార్టీ ప్రభావం మరింత విస్తరించే అవకాశం ఉంది.ఈ పార్టీ కూడా ప్రధానగా మతపరమైన లక్ష్యాలతో ముందు వెళుతుంది.అదే సమయంలో ఇతర పార్టీలతో ఎలాంటి ఒప్పందాలు ఉంటాయో చూడాలి.

సవాళ్లు మరియు ప్రభావాలు


ఈ ఎన్నికలు ఒకే దశలో జరిగే అవకాశం ఉండడంతో రాజకీయ పార్టీలకు నిర్వహణ పరమైన సవాళ్లు తెచ్చిపెట్టే అవకాశం ఉంటుంది.మహిళలకు 50% రిజర్వేషన్లతో అన్ని పార్టీలు మహిళా అభ్యర్థులను ప్రోత్సహించాల్సిన ఏర్పడింది. ఇది రాజకీయాల్లో మహిళల పాత్రను పెంచుతుంది.ఓటర్ జాబితాలు,ఎన్నికల భద్రత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి.మొత్తంగా ఈ మున్సిపల్ ఎన్నికలు 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు సూచనగా మారనున్నాయి. కాంగ్రెస్ విజయం సాధిస్తే ప్రభుత్వం మరింత బలపడుతుంది.లేదంటే ప్రతిపక్షాలు మరింత దూకుడుగా మారే అవకాశం ఉంటుంది.ఏతా వాతా పురపోరు రాజకీయ పార్టీలకు సెమీ ఫైనల్ పోటీగా చూడాలి.ఇప్పటికే రాష్ట్ర రాజకీయాలు బలాబలాలు సరి చూసుకునే పనిలో పడ్డాయి. అభ్యర్థుల వేట వేగంగా జరుగుతుంది.పార్టీల్లోని అసంతృప్తులు గోపిలు(గోడ మీద పిల్లి)గా టిక్కెట్ రాకపోతే జంపింగ్ జపాంగ్ అనడానికి రెడీ అయిపోయారు.పార్టీల హామీలు, ప్రజల సమస్యలు ప్రిపేర్ గా ఉన్నాయి.ఆశావాహులు మరింత ఉత్కంఠభరితంగా ఎదురుచూస్తున్నారు.ఇప్పుడిప్పుడే చలి కాలం తగ్గు ముఖం పడుతుందని భావిస్తున్న తరుణంలో వేసవి తాపం కంటే ముందు మున్సిపల్ ఎన్నికల వేడి ప్రజలను తాకుతుంది.ఇక రాజకీయ సాగులో పంట పండేది ఎవరికో మంట మండేది ఎవరికో తెలియాలంటే,పట్టణ ఓటరు మహాశయుని గుప్పిట్లో దాగిన ఓటు మంత్రం విప్పితే కానీ, తెలియదు.

గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

# దళితుడైన కర్ల రాజేష్ లాకప్ డెత్ మృతికి నిరసనగా ఫిబ్రవరి 5 న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి.

**కోదాడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల అఖిలపక్ష సమావేశం నిర్వహణ**

**ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ**



**ధర్మ ఘంట జనవరి 20,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** దళితుడైన కర్ల రాజేష్ లాకప్ డెత్ మృతికి నిరసనగా ఫిబ్రవరి 5 న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని మంగళవారం జమ్మిగడ్డ లోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ భవన్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ పాల్గొని మాట్లాడుతూ కర్ల రాజేష్ లాకప్ డెత్ మృతికి నిరసనగా భవిష్యత్తు ఉద్యమ కార్యచరణకై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాలు అమలు చేసేదానిలో భాగంగా బుధవారం కోదాడలో అన్ని రాజకీయపక్షాల నేతలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 22 న అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 25 న మండల కేంద్రాల్లో ఉన్న ప్రధాన కూడళ్ళ లో మానవహారాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కోదాడ కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనలో నాటి కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి,సూర్యాపేట ఎస్పీ నరసింహా పాత్ర ఉందని అన్నారు.నిజానికి కర్ల రాజేష్ ను అక్రమంగా ఏ పిర్యాదు లేకుండా చట్టవిరుద్ధంగా చిలుకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం డీఎస్పీ,ఎస్పీ లకు తెలుసు అని అన్నారు.ప్రతి రోజూ పోలీసు స్టేషన్ లాకప్ లకు సంబంధించిన సమాచారం ( డైలీ సిట్యువేషన్ రిపోర్ట్) ఎస్పీ, డీఎస్పీలకు ఉన్నప్పటికీ ఉద్దేశ పూర్వకంగానే నిర్లక్ష్యం చేసి రాజేష్ మరణానికీ వారు కూడా కారకులయ్యారు అని అన్నారు. ఈ కేసును పక్కదారి పట్టించేందుకు మొదటి నుండి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారని అన్నారు.అందులో బాగంగానే రాజేష్ పోస్టుమార్టం కు ముందు ఎస్పీ నరసింహ గాంధీ హాస్పిటల్ కు ఎస్ఐ సీఐ లను పంపించారని అన్నారు.పోలీసులే గాంధీ హాస్పిటల్ లో డాక్టర్లను , మరియు ముషీరాబాద్ మెజిస్ట్రేట్ కు మేనేజ్ చేసి పోస్టుమార్టం చేయించుకున్నారు .అందుకే ఆ రోజు డ్యూటీలో లేని లక్ష్మీకాంత్ రెడ్డి అనే రెడ్డి డాక్టర్ ను పిలిపించి పోస్టుమార్టం చేయించారు. వీడియో గ్రాఫర్ ను కూడా కోదాడ నుండి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రామకృష్ణ రెడ్డి ని పిలిపించారని అన్నారు. అందువలన ఈ కేసును కప్పిపుచ్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేయడంతో తమ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డీఎస్పీ శ్రీధర్ రెడ్డిని ఏ3 గా, ఎస్పీ నరసింహను ఏ 4 గా రాజేష్ లాకప్ డెత్ కేసులో చేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖకు నిజాయితీ ఉంటే ఈ ఘటన మీద ప్రధానంగా డీఎస్పీ ఎస్పీ పాత్రల మీద డిఐజి లేదా ఐజి లేదా అంతకన్నా ఉన్నతస్థాయి అధికారితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.పోలీసు స్టేషన్లలో ఉన్నత వర్గాలకు రాజకీయ నేతలకు అత్యున్నత గౌరవం దక్కుతుందని అణగారిన వర్గాలకు ,పేదలకు అవమానాలు హింస ఎదురవుతుందని అన్నారు.ప్రస్తుతం పోలీస్ స్టేషన్లు పేదలను హింసించే దొరల గడీల వలె మారాయని అన్నారు.ఇది చట్టాన్ని గౌరవించే వారు ఎవరు కూడా అంగీకరించని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటన మీద సిబిఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్ బాబు మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ ఎమ్మెస్పి రాష్ట్ర నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ కనుకుంట్ల వెంకన్న మాదిగ ములకలపల్లి రవి మాదిగ చింత సతీష్ మాదిగ,మేడి కృష్ణ మాదిగ, దాసరి వెంకన్న మాదిగ,మారపంగు రామంజీ మాదిగ,గ్యార కనకయ్య మాదిగ, మారేపల్లి జగన్ మాదిగ,సిరిపంగి నవీన్ మాదిగ, సూరారపు తిరుమలేష్ మాదిగ,మైకెల్ రాజు మాదిగ మిరియాల చిన్ని మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ధర్మఘంట, జనవరి 20, కరీంనగర్:** ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు కవాతు మైదానంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు వేదిక, పార్కింగ్, విద్యుత్, అలంకరణ, సౌండ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఎక్కువ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 108, 102, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది పేర్లను పరిశీలించి నివేదికలు పంపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ కవాతు మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామన్నారు. పోలీస్ బందోబస్తుతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు




కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్ లో చరిత్ర సృష్టించిన సాందీప్ విద్యార్థులు



**నల్గొండ జనవరి 20( ధర్మ గంట) :** ప్రతిష్టాత్మకమైన్న ఇంటర్ నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో నల్లగొండ పట్టణంలోని సాందీప్ హైస్కూల్ నుండి 41 మంది విద్యార్థులు రెండవ దశకు ఎంపిక కాబడి చరిత్ర సృష్టించారని సాందీప్ పాఠశాల వ్యవహర్త గానూతుల సత్యనారాయణరెడ్డి తెలిపారు.ఒలంపియాడ్ కు ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో సన్మానించి మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లభాషపై పూర్తి పట్టు సాధించి పాఠ్య పుస్తకాలే కాకుండా 21వ దశాబ్దానికి కావలిసిన వ్యాకరణము మంచి అవగాహన,భాషా పరిజ్ఞానం గల ఉత్తమ బోధనతో ఈవిజయం సాధించారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రెండవ దశకు అర్హత సాధించిన విద్యార్థులను,ఉపాధ్యాయులను వ్యవహర్త అభినందించారు.

## నాయకుని తండా లో గృహ జ్యోతి "0" బిల్లు పత్రం లబ్ధిదారులకు అందజేత

**- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మేరావత్ మునినాయక్.**



**తిరుమలగిరి (సాగర్ ) న్యూస్ :** మండలంలోని నాయకుని తండాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ,ప్రజా పాలనలో ఇచ్చిన గృహ జ్యోతి పథకం క్రింద 200 యూనిట్లు ఒక కుటుంబానికి ఉచిత కరెంట్ భాగంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మేరావత్ మునినాయక్ చేతుల మీదగా 82 మంది లబ్ధిదారులకు "0" బిల్లు పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్తభుత్వం ఏర్పడి 2సం కాలంలో లోటు బడ్జెట్ ఉన్న బడుగు బలహీన వర్గాలకు సన్నబియ్యం, 2లక్షల రైతులకు రుణమాఫీ, రేషన్ కార్డు, 5లక్షల ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, యం.పి.రఘువీర్ రెడ్డి, ఏమ్మెల్యే జయవీర్ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేరావత్ పూల బిచ్యాలు నాయక్, ఉపసర్పంచ్ మోతిలాల్, కరెంట్ అధికారులు లైన్ మెన్ కొండలు మధు, లబ్ధిదారులు సరోజ, బోడక, సక్రు, శైలజ, కమిలి, సుష్మా, బాల నాయక్, కృష్ణయ్య చారి, శంకర్, సైది,మధు,సేలి తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు జరగకుండా ఉండాలంటే చదువు ఒకటే పరిష్కారం

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**






**నల్గొండ జనవరి 20( ధర్మ గంట):** బాల్యవివాహాలు జరగకుండా ఉండాలంటే చదువు ఒకటే మార్గమని, విద్య పట్ల పిల్లలకు,తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.మంగళవారం ఆయన కలెక్టరేట్ ప్రాంగణంలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ శాఖ సహకారంతో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో జాగ్రత్త పేరుతో రూపొందించిన బాల్య వివాహాల విముక్తి ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.దేశంలో ఆదర్శ భావాలు,అభివృద్ధి చెందుతున్న సమయంలో బాల్యవివాహాలలాంటి సామాజిక రుగ్మతలు ఉండరాదని కలెక్టర్ అన్నారు.అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండక ముందే బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమే కాక,నేరమని,ఈ చర్యలు బాలల భవిష్యత్తును దెబ్బతీయడమే కాకుండా,వారి ఆరోగ్యం, విద్య,హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు.బాల్యా వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాల్య వివాహాలు నేరమని,ఎవరు బాల్య వివాహాలు చేసిన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించి బాల్యవివాహాలను అడ్డుకోవాలని కోరారు.బాల్యవివాహాల నిర్మూలనకు రూపొందించిన ప్రచార రథం జిల్లా వ్యాప్తంగా గ్రామాలు,మండలాల్లో తిరుగుతూ పాటలు, నినాదాలు, పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుందని, ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, సీడీపీవో హరిత,ఆశ్రిత స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ నాగరాజు,గణేష్, చింతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే ప్రజాబాట,




**ధర్మ ఘంట, జనవరి 20 మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాశా వాడలో మంగళవారం ప్రజాబాట కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ వల్ల ప్రమాద భయం ఉందని పలువురు విన్నవించారు.గ్రామస్తుల వినతులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు వెంటనే స్పందించి, ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ లైన్‌ను మార్చి వేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ లైన్‌ను ఇతర మార్గంలోకి మళ్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత సురక్షితంగా, ఉండేందుకు ఆరు (6) కొత్త విద్యుత్ స్తంభాల విస్తరణకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభించి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి, ఏఈ, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ద్వితీయ వార్షికోత్సవం



**ధర్మ ఘంట జనవరి 20,నల్గొండ:** జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు హనుమాన్ నగర్ లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోస్తావము మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణములో వేద పండితులతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమములో మాజీ మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి,ఎడ్ల శంకర్,గుండెబోయిన వెంకన్న యాదవ్,కమిటీ సభ్యులు అధ్యక్షులు భైరగోని రాజయ్య, ప్రధాన కార్యదర్శి బండారు ప్రసాద్, ఉపాధ్యక్షులు వీరేల్లి చంద్ర శేఖర్, ఇటీకాల కృష్ణయ్య, గార్లపాటి వెంకటయ్య,నన్నూరి రాంరెడ్డి, బొడ్డుపల్లి సతీష్, నాళ్ల వెంకన్న,బిజెపి నాయకులు నరాల శంకర్ కాశామ్మ, లక్ష్మి ప్రసన్న భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ స్ఫూర్తిని కళాశాలల ద్వారా వ్యాప్తి చేయాలి

**- సూదిని పద్మా రెడ్డి**



**ధర్మ ఘంట జనవరి 20,హైదరాబాద్ :** ది ఎర్త్ సెంటర్ లో వాతావరణ మార్పులు పర్యావరణ సుస్థిరత అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. తెలంగాణలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు వంద మందికి పైగా అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్న ఈ కార్యక్రమం ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా సూదిని పద్మా రెడ్డి పాల్గొని కళాశాలలు సి జి ఆర్ సంస్థ పర్యావరణ స్ఫూర్తిని ఎక్కడికక్కడ కళాశాలల ద్వారా వ్యాప్తి చెయ్యాలని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్స్ అందరికీ సరిఫికెట్స్ అందజేసి సి జి ఆర్ పర్యావరణ క్యాలెండర్ విడుదల చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి, సి జి ఆర్ సంస్థ వ్యవస్థాపకులు కోర్పోలు లక్ష్మారెడ్డి ,పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డి , సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎస్ కే లెనిన్ బాబు , అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ జగన్, డాక్టర్ వసంతలక్ష్మి, డాక్టర్ ప్రియా కుమారి, డాక్టర్ ఆనీ షిరాన్ మరియు సి జి ఆర్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ జెఏస్సార్ అన్నమయ్య సభ్యులు కోటయ్య, నగేష్,రజనీకాంత్, వైష్ణవి, హరిత దేవి, సాత్విక, శివ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య తో పాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి



**ధర్మ ధర్మఘంట, జనవరి 20 నల్లగొండ :** బాలికల అభ్యున్నతికి నాణ్యమైన విద్య తో పాటు జీవన నైపుణ్యాలు, క్రీడలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జి ఈ సి ఓ కత్తుల అరుంధతి లు కేజీబీవీ ప్రత్యేక అధికారులకు సూచించారు.బాలికలను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలని ఉద్దేశంతో జాతీయ విద్య ప్రాణాలిక పరిపాలన సంస్థ, (ఎన్ ఐ ఈపిఏ) మినిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలోని కేజీబీవీ ప్రత్యేక అధికారులకు ఐదు రోజులపాటు జిల్లా విద్యాశాఖ, జెండర్ క్విటీ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని గడియారం సెంటర్లోని డైన్ ఇన్ హోటల్లో మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.కేజీబీవీ లోని బాలికలు వారి తల్లిదండ్రుల వద్ద కంటే ఎక్కువ సమయం ప్రత్యేక అధికారులతో ఉపాధ్యాయులతోనే గడుపుతారని అన్నారు.వారికి ఉత్తమ విద్య, సరైన సౌకర్యాలు,సత్ప్రవర్తన, అందించే బాధ్యత కేజీబీవీ ప్రత్యేక అధికారుల దేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు వి.శివలీల, టి.పల్లవి,కే.నర్మద,సమత, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌పై కేంద్రం శభాష్!

**యాప్ ను వచ్చే ఖరీఫ్ కల్లా అన్ని జిల్లాలలో అమలులోకి తేవాలి**

**రైతులను సేంద్రియ, ఆర్గానిక్ వ్యవసాయాలు చేసేలా వారిని ప్రోత్సహించాలి**

**ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా త్వరలో సర్టిఫికేషన్ యాప్**

**డిపార్ట్ మెంట్లు, కార్పోరేషన్లు వేసే అన్ని కమిటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి**

**డిపార్ట్ మెంట్ల వారీగా శాఖల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల**



**ధర్మఘంట జనవరి 20 హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా (ఫెర్టిలైజర్) యాప్ ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని మంత్రి తుమ్మల తెలిపారు. వచ్చే ఖరీఫ్ కల్లా ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తేవాలని అన్నారు.సచివాలయంలో వ్యవసాయ,మార్కెటింగ్, కో-ఆపరేషన్ మరియు హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ సెక్రటరి మరియు ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంగళవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ,ప్రకృతి వ్యవసాయం మరియు తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని,అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి,మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీ అవుతున్నందున నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందన్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందన్నారు.ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు,ఎలా పండించాడో తెలుసుకుంటాడన్నారు. అదేవిధంగా అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాలలో ఆర్గానికి పంటలు పండించి,అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మినట్లైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే 50 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పట్టించుకోని కేంద్ర ప్రాయోజిత పథకాలను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి ఆదేశాలనుసారం ఒకొక్కటిగా పునరుద్ధరిస్తోందని, అందులో భాగంగా ఈ సంవత్సరం వివిధ పథకాల క్రింద ఇప్పటికే రూ.500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని, కేంద్రం నుంచి వచ్చే ఒక్క పైసా కూడా వృథాగా తిరిగి వెళ్లకూడదని అధికారులకు సూచించారు.వచ్చే ఖరీఫ్ నాటికి పెద్దమొత్తంలో యూరియా బఫర్ స్టాక్ లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని,రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాలకు బోనస్ ఇస్తున్నందున,పంటకాలనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ ద్వారా సన్న వడ్లలో మేలైన వంగడాలను సూచించాలని,రైతులు అట్టి రకాలను ఉత్పత్తి చేసి మంచిధర పొందేటట్లు చూడాలన్నారు. అధికశాతం ఖచ్చితత్వంతో శాటిలైట్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని,ఈ నెలాఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంటల శాటిలైట్ మ్యాపింగ్ డేటా రావాలని అధికారులను ఆదేశించారు.మూడు సంవత్సరాల పంటల శాటిలైట్ మ్యాపింగ్ తో డేటా అందించాలని,డేటా ఫైనలైజ్ చేసేముందు ఒకసారి అధికారులతో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖల డిపాజిట్లు ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులలో కాకుండా కో-ఆపరేటివ్ మరియు అర్బన్ కోఆపరేటీవ్ బ్యాంకులలో చేసేలా చూడాలని అధికారులకు సూచించారు.అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో కేంద్రం ఇచ్చిన లక్ష్యానికి రెట్టింపు ప్లాంటేషన్ జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి అన్నారు.తక్కువ పురోగతి ఉన్న ఆయిల్ పామ్ కంపెనీలను రద్దు చేసి,వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు గాని,వేరే ఇతర కంపెనీలకు కేటాయించాలన్నారు. ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలలో మోడల్ పామ్ అభివృద్ధి చేసి,ఆయిల్ పామ్ రైతుల సందర్శనార్థం ఉంచినట్లైతే,వారికి వచ్చే అనుమనాలను కూడా నివృత్తి చేసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. 44 శాతానికి పెంచినట్లైతే టన్ను ఆయిల్ పామ్ ధర 25000 వరకు చేరుకుంటుందని,దాంతో రైతులకు కూడా ఆయిల్ పామ్ పంట వేయలనే కోరిక పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ బడ్జెట్ సమావేశాలలోనే దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు.రాష్ట్ర అవసరాల కోసం కూరగాయలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, ఈ పరిస్థితి మారాలన్నారు. డిమాండ్ కు తగ్గట్టుగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని, కూరగాయల సాగులో విజయవంతం అయిన రైతులను రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఇతర రైతులతో మాట్లాడించాలని, గ్రామాలలోనే కాకుండా పట్టణాలలో కూడా అందుబాటులో ఉన్న స్థలాలలో మరియు టెర్రస్ ల మీద కూరగాయలు పండించేలా అవగాహన కల్పించాలన్నారు.రైతుల కోసం డిపార్ట్మెంట్లలో గాని, యూనివర్సిటీలలో గాని, మరియు కార్పోరేషన్లలో గాని,ఏర్పాటు చేసే ప్రతి కమిటీలలో అధికారులతో పాటు రైతుల ప్రాతినిధ్యం వహించేలా కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కమటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉన్నట్లైతే రైతుల అవకాశాలు, అవసరాలకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవచ్చని అన్నారు.రైతు వేదికల దగ్గర సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు.డిపార్ట్మెంట్లకు సంబంధించి ఉన్న ఖాళీ ప్రదేశాలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, ఉత్పత్తి అయి మిగిలిన కరెంట్ ను గ్రిడ్ కు అమ్ముకొవచ్చన్నారు.ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు రైతువేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంట్ ఉత్పత్తి అవుతుందన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్,వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి,హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హెచ్ఏసిఏ ఎండి చంద్రశేఖర్ రెడ్డి,మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మానవ జీవన విధానంలో ఔషధ మొక్కల పాత్ర అత్యంత ప్రధానం

ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి





**ధర్మ ఘంట జనవరి 20,హైదరాబాద్**

మానవ జీవన విధానంలో ఔషధ మొక్కల పాత్ర అత్యంత ప్రధానమని ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి అన్నారు. వన్ డే ఓరియంటేషన్ ఫీల్డ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్ నుండి ది ఎర్త్ సెంటర్ అన్మాస్ పల్లి ని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి ఉమెన్స్ కళాశాల నారాయణ గూడ విద్యార్థులు, అధ్యాపకులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు అంకితభావం కలిగి ఉండాలని, అంతరించిపోతున్న అడవులప్రాముఖ్యతను,వాతావరణ మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సిజీఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ రజనీకాంత్ ఔషధ మొక్కల అవశ్యకత, ఫర్మా కల్చర్ విధానాలను, ఫారెస్ట్ వాక్, వర్మీ కంపోస్ట్, ఆర్త పాలజి, రైన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి అంశాలను వివరించడం పాముల మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఏ రజని డిపార్ట్మెంట్ ఆఫ్ బాట్నీ మరియు ఫుడ్ అండ్ న్యూట్రిషన్ హెచ్ ఓ డి, డాకర్ కవిత, రీమా, రవళిక, తులజభవానీ, విద్యార్థులు సి జి ఆర్ సంస్థ సభ్యులు ఏసు బాబు, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలసిన ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం నేతలు



**ధర్మఘంట, జనవరి 20, నల్లగొండ :** జిల్లాకి నూతనంగా విచ్చేసిన భాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ని నేడు ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో విద్యారంగ సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ కట్టెల శివకుమార్, రిటైర్డ్ పెన్షనర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి బిక్షపతి, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జానిమియా, సంఘం గౌరవ సలహాదారులు కందుల విజయ్ కుమార్, విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ అల్లంపల్లి కొండన్న, రాష్ట్ర కార్యదర్శి కామల్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల లింగస్వామి, కార్యదర్శి బాకి తరుణ్, జిల్లా నాయకులు గోపి నాయక్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు

## జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ధర్మఘంట జనవరి 20 కరీంనగర్:ఈనెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ దినోత్సవం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు.జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని బూత్ స్థాయి పోలింగ్ అధికారులు నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ,వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామం,వార్డు స్థాయిలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలన్నారు.25న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఓటు హక్కు, ఓటు ప్రాధాన్యత, ఆవశ్యకతపై తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన వంటి పోటీలను నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,ఆర్డీవోలు మహేశ్వర్,రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.